# వాస్తవం

డెయిలీ. కామ్

ఉన్నది ఉన్నట్లుగా

డిజిటల్ పత్రిక

గురువారం 30.07.2026

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి(కె.ఆర్)


## తెలంగాణ పోలీస్ శాఖలో భారీ రిక్రూట్‌మెంట్

### 7,437 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్, జులై 29:** తెలంగాణ పోలీస్ శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీకి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ పోలీస్ నియామక మండలి ఈ నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం నాలుగు నోటిఫికేషన్లు విడుదల చేసింది. వీటి ద్వారా సివిల్, ఏఆర్, స్పెషల్ పోలీస్, ఫైర్, జైళ్ల శాఖలో ఖాళీగా ఉన్న దాదాపు 7,437 ఉద్యోగాలు భర్తీ చేయనుంది. ఈ ఆన్‌లైన్ దరఖాస్తుల తేదీలను త్వరలో పోలీస్ నియామక మండలి ప్రకటించనుంది. దరఖాస్తుకు ముందు వైద్య, శారీరక ప్రమాణాలు పరిశీలించుకోవాలని అభ్యర్థులకు సూచించింది.

కానిస్టేబుల్ (సివిల్) 3,697. కానిస్టేబుల్ (ఏఆర్) 1,052 పోస్టులు.
స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఎస్సై 44, కానిస్టేబుల్ 1,380 పోస్టులు.
అగ్నిమాపక శాఖలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ 39, ఫైర్ ఫైటర్ 751 పోస్టులు.
జైళ్ల శాఖలో 223 పోస్టులు భర్తీ చేయనున్నారు.

# క్షమాపణల సంగతి సరే.. అక్రమాల సంగతేంది?

- కేసీఆర్ పాలనాకాలంలో అభివృద్ధి..అరాచకాలు
- నేరెళ్ల దాష్టికంపై సిగ్గుతో తలదించుకుంటే సరిపోతుందా?
- మిగతా నియోజకవర్గాల్లో అక్రమాల మాటేంటి?
- కొలువుల దందాల బలవన్మరణాలు
- కాళేశ్వరం అవినీతి హత్యలు
- అదుపులేని అవినీతి.. అడ్డగోలు అక్రమార్జనలు




**కవిత తల దించుకోవడాల్లో నిజమెంత?**

12లో..



ఒక్క సిరిసిల్ల నియోజక వర్గంలో జరిగిన దాష్టికం సంగతే కాదు.. తెలంగాణ వ్యాప్తంగా అనేక నియోజకవర్గాల్లో అనేక అరాచకాలు చోటుచేసుకున్న విషయం కవిత మరువరాదు. వాస్తవానికి గత పదేండ్ల కేసీఆర్ పాలనలో అభివృద్ధి ఎంత జరిగిందో అరాచకం కూడా అంత కన్నా ఎక్కువే జరిగింది.కేసీఆర్ పాలనా కాలంలో అనేక అద్భుత కట్టడాలు, అనేక సంక్షేమ పథకాలను అమలు చేసింది వాస్తవమే. అభివృద్ధి, సంక్షేమం గత బీఆర్ఎస్ పాలనలో నాణానికి ఒక వైపు మాత్రమే. మరోవైపు అరాచకం, నియంతృత్వం, అదుపులేని అవినీతి, వందల కోట్ల రూపాయల దోపిడీ ఉంది.

### కాళేశ్వరం విషయంలో

# బీఆర్ఎస్‌ది బూటకపు ప్రచారం

**కాళేశ్వరం నుంచి నీటి చుక్క వాడకుండా అత్యధిక ధాన్యం పండించిన తెలంగాణ**

**తెలంగాణ అని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**న్యూఢిల్లీ, జులై 29:** కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి చుక్క కూడా వాడకుండా భారతదేశంలోనే అత్యధికంగా ధాన్యం పండించిన రాష్ట్రం తెలంగాణ అని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన బుధవారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టిన వారం రోజుల్లోనే లీక్ అయిందన్నారు. ఈ విషయం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కి కూడా తెలుసునని పేర్కొన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణారెడ్డి సహా అధికారులపై చర్యలు తీసుకోవాలని చెప్పినా పట్టించుకోలేదని అన్నారు. సుమారు మూడేళ్లుగా నిరుపయోగంగా ఉన్న ప్రాజెక్టుకు రూ.16 వేల కోట్ల వడ్డీ రూపంలో కడుతున్నామని వివరించారు. కాళేశ్వరంపై బీఆర్ఎస్ పార్టీ పిచ్చి రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. కానీ ఆ ప్రాజెక్ట్‌తో తాము అలాంటి రాజకీయాలు చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బాధ్యత లేకుండా మాట్లాడడం దురదృష్టకరమని అన్నారు. ఇసుకలో కాళేశ్వరం ఫౌండేషన్ వేశారని గుర్తు చేశారు. ఐఐటీ బాంబే అఫ్రి కంపెనీతో సాయిల్ టెస్ట్ చేయించామని పేర్కొన్నారు. బ్యారేజీలు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నాయని.. అంటే అది ఓపెన్ చేస్తే ప్రజలకు ఏమైనా అయితే ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ కక్కుర్తి, అసమర్థత వలన కాళేశ్వరం కూలిపోయిందని విమర్శించారు. అయితే కాళేశ్వరం విషయంలో తమకు రాజకీయ దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం విషయంలో బిఆర్ఎస్ పార్టీ



బూటకపు ప్రచారం చేస్తున్నదని ఆరోపించారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు రక్షణ

**లోక్‌సభ ఆమోదంతో పేపర్ లీక్‌లకు చెక్**

**కేంద్ర మంత్రి అమిత్ షా**



**ఢిల్లీ:** దేశంలోని లక్షలాది మంది పరీక్షార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర ప్రభు త్వం తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లు–2026'కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశవ్యాప్తంగా ఉన్న విద్యా ర్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ చట్టం ద్వారా పోటీ పరీక్షల్లో పారదర్శకత పెరుగుతుందని, పేపర్ లీకేజీలు, నకిలీ పరీక్షలు, ఇతర అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని ఆయన పేర్కొన్నారు. నిజాయతీగా శ్రమించే విద్యార్థుల భవిష్యత్తును రక్షించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అమిత్ షా మా ట్లాడుతూ.. 'పరీక్షల నిర్వహణలో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవు. పేపర్ లీక్‌లు, మోసపూరిత కార్యకలాపాలు, పరీక్షల గోప్యతను భంగం చేసే వారిపై కఠిన శిక్షలు అమలు చేస్తాం. ఈ చట్టం అమల్లోకి రావడంతో పోటీ పరీక్షలపై విద్యార్థుల్లో విశ్వాసం మరింత పెరుగుతుంది. ప్రతిభ ఆధారంగా అవకాశాలు లభించే వ్యవస్థను బలోపేతం చేయడంలో ఇది కీలక మైలురాయిగా నిలుస్తుంది. కేంద్ర ప్రభు త్వం విద్యార్థుల ప్రయోజనాలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటూ పరీక్షా వ్యవస్థను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉంది' అని అన్నారు.

## యువత భవిష్యత్తులో నైపుణ్యాలకన్నా.. సృజనాత్మకతే ఓ సవాల్



10లో..

## వారానికోసారి మిడ్ డే మీల్‌గా చికెన్ బిర్యానీ

**తమిళనాడు సర్కారు కీలక నిర్ణయం**

**చెన్నై:** పాఠశాల విద్యార్థులకు మరింత పౌష్టికాహారం అందించడంతోపాటు భోజనాన్ని ఆసక్తికరంగా మార్చేందుకు తమిళనాడులోని విజయ్ ప్రభుత్వం కీలక ప్రతిపాదన చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వారానికి ఒకసారి 'చికెన్ బిర్యానీ' అందించే అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా యోచిస్తోంది. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే, దేశంలోనే సుదీర్ఘకాలంగా అమలవుతున్న ఈ పథకంలో ఇదొక ముఖ్యమైన మార్పు అవుతుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉంది. మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్న సాంఘిక సంక్షేమ, మహిళా సాధికారత శాఖతో సంప్రదింపులు జరిపిన తర్వాత తుదినిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం పెంచే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. వారానికి ఒకసారి ప్రోటీన్ అధికంగా ఉండే చికెన్ బిర్యానీని అందించడంవల్ల విద్యార్థుల ఆరోగ్యానికి మేలు జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. దాంతోపాటు భోజనం నాణ్యతను, ముఖ్యంగా పాఠశాలలకు సరఫరాచేసే బియ్యం నాణ్యతను మెరుగుపరిచే అంశంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రస్తుతం తమిళనాడులో 1 నుంచి 10వ తరగతి వరకు సుమారు 40 లక్షల మంది విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకం ద్వారా లబ్ధి పొందు తున్నారు. అలాగే ముఖ్యమంత్రి అల్పాహార పథకం ద్వారా 1 నుంచి 8వ తరగతి వరకు 32 లక్షల మంది పిల్లలకు ప్రయోజనం చేకూరుతోంది. ఈ రెండు పథకాలను 11, 12 తరగతులకు కూడా విస్తరించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. దీనివల్ల మరో 8 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి





చేకూరు తుందని అంచనా. హయ్యర్ సెకండరీ విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంవల్ల వారి హాజరు మెరుగుపడి, డ్రాపవుట్లు తగ్గుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దేశంలో ఇలాంటి పథకాలకు మార్గదర్శకంగా నిలిచిన తమిళనాడు, చికెన్ బిర్యానీ ప్రతిపాదనతో మరో ముందడుగు వేసినట్టు అవుతుంది.

# బీరంగూడ డివిజన్ పరిధిలో ఘనంగా గురుపౌర్ణమి

**ప్రత్యేక పూజల్లో కాట సుధారాణితో కలిసి పాల్గొన్న శశిధర్ రెడ్డి**

**వాస్తవం : అమీన్ పూర్**



అమీన్ పూర్ సర్కిల్ పరిధిలోని బీరం గూడ డివిజన్ పరిధిలోని సాయి కాలనీ, ఎన్ఆర్ఐ కాలనీ, గోశాలలో గల సాయిబాబా ఆలయాలలో గురుపౌర్ణమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధాశ్రీనివాస్ గౌడ్, అమీన్ పూర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి ప్రత్యేక అతిథులుగా పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మరియు ఆలయ నిర్వాహకులు ఇరువురు నాయకులకి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో సాయిబాబా వారికి వేదమంత్రాల మధ్య అభిషేకం, ప్రత్యేక పూజలు మరియు హారతి కార్యక్రమాలు నిర్వహించి బాబా ఆశీస్సులు ప్రజలందరి పై సంపూర్ణంగా ఉండాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తుల కొరకు అన్నదాన ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, ఆలయ డైరెక్టర్లు రమేష్ యాదవ్, మల్లేష్ యాదవ్, కుమ్మరి మహేష్, చంద్రశేఖర్, జన్ముల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# నృత్య కళానికేతన్ ఆధ్వర్యంలో సినారే జయంతి




**వాస్తవం : వేములవాడ**

వేములవాడ నృత్య కళానికేతన్ సేవా సంస్థ, జిల్లా సాంస్కృతి కళా సంస్థల సమాఖ్య, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కళాకారుల విభాగం ప్రధాన కార్యాలయం వేములవాడ లో బుధవారం డాక్టర్ సింగిరెడ్డి నారాయణ రెడ్డి 95జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి సినారే చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. ఈ సందర్భంగా యెల్ల పోశెట్టి మాట్లాడుతూ వేములవాడ మండలం హనుమాజీపేట ముద్దుబిడ్డ, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, దివంగత మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ సి నారాయణరెడ్డి మారుమూల గ్రామం నుండి జాతీయస్థాయికి ప్రఖ్యాతి సాధించాలని అన్నారు.

## జంతర్ మంతర్ ఆందోళనలో

# విద్యార్థులపై లాఠీచార్జ్ అమానుషం

**సీపీఐ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి**

**ఆగస్టు 6 నుంచి 15 వరకు పల్లె పల్లెకు సీపీఐ పాదయాత్రలు**

**వాస్తవం : హుస్నాబాద్ :**



నీట్ పేపర్ లీక్‌తో లక్షలాది మంది విద్యార్థులను మానసిక వేదనకు గురి చేసి విద్యార్థుల చావులకు కారణమైన ప్రధాన నరేంద్ర మోదీ తక్షణమే రాజీనామా చేయాలని సీపీఐ సీనియర్ నేత,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నాడు హుస్నాబాద్ నియోజకవర్గ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుల సమావేశం సిపిఐ నియోజకవర్గ నాయకులు నాగెల్లి లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సమావేశం నాయకులను ఉద్దేశించి చాడ వెంకటరెడ్డి ప్రసంగి అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్ లతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును బలి చేసారని నీట్ పరీక్షల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించాలని అభిప్రాయపడ్డారు.జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళనలో విద్యార్థులపై లాఠీ ఛార్జ్ అమానుష్యమైన ఘటనపై సుప్రీం కోర్టు న్యాయమూర్తులు సరైన సమయంలో స్పందించకపోవడం సరి కాదని చట్టాలు పాలకులకు చుట్టాలైనాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశంలో మార్పు కావాలి బీజేపీ గద్దె దిగి పోవాలనే నినాదంతో ఆగస్టు 6 నుండి 15 వరకు పల్లె పల్లెకు సీపీఐ పాదయాత్రలు జయప్రదం చేయుట కొసం ప్రజలు సహకరించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు నాయకులకు ప్రజలకు పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ, సిద్దిపేట జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అదరి శ్రీనివాస్, కనుకుట్లశంకర్, నియోజకవర్గ సీపీఐ నాయకులు బొయిని అశోక్, గూడెం లక్ష్మి,ఉట్కూరి రాములు,బత్తుల బాబు, బాషబోయిన సంతోష్,తెరాల సత్యనారాయణ, జనగాం రాజ్ కుమార్, గాంభీరవు మధు,తోట బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కార్పొరేటర్ నెలకంటి



**వాస్తవం : గోదావరిఖని**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 38వ డివిజన్‌లోఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం వల్ల హనుమాన్ నగర్ అంబేద్కర్ నగర్ మరియు డివిజన్లోని లోతట్టు ప్రాంతాలను కార్పొరేటర్ నెలకంటి రాము పరిశీలించిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వరద ప్రభావిత వృద్ధులకు భోజనం ఏర్పాట్లు చేశారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామ న్నారు. వర్షపు నీరు దారి మళ్ళించడానికి పరిశీలించారు. డివిజన్ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# రెయిన్ కోట్లు పంపిణీ

**బాపుసాయిపేట ఉపసర్పంచ్ తిక్కల నవీన్**



**వాస్తవం : కోనరావుపేట**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల్లో ఆ గ్రామ ఉప సర్పంచ్ తిక్కల నవీన్ మానవతా దృక్పథాన్ని చాటు కున్నారు. గ్రామం లో వర్షం కురు స్తున్న సమయాల్లోనూ పనులు చేయాల్సి వస్తున్న సిబ్బంది ఆరోగ్యాన్ని, భద్రతను దృష్టిలో ఉంచుకుని నవీన్ స్వయంగా కార్మికులకు రేయిన్ కోట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూవాతా వరణం ఎలా ఉన్నా గ్రామం బాగుకోసం నిరంతరం చెమ టోడ్చే సిబ్బంది మనోధైర్యమే మన గ్రామానికి శ్రీరామ రక్ష. వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యతని పేర్కొ న్నారు. తమను గుర్తించి రేయిన్ కోట్లు అందించిన ఉప సర్పంచ్ నవీన్‌కు గ్రామపంచాయతీ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

# సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమ ప్రత్యేక పూజలు

**వాస్తవం : మద్నూర్:**



కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కేంద్రంలోని శ్రీ సాయి బాబా ఆలయంలో గురు పౌర్ణిమ సందర్భంగా భక్తులు ప్రత్యే క పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా ఆలయ ఆవరణంలో సత్యనారాయణ వ్రతాలు, అన్నదానాలు నిర్వహించారు. గ్రామంలోని భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి, నైవేద్యాలు సమర్పించి, పూజలు చేశారు. దీంతో ఆలయానికి భక్తుల తాకిడితో పోటెత్తింది.

# ప్యాక్స్ చైర్మన్ జలగం కిషన్ రావును పరామర్శించిన చల్మెడ

**వాస్తవం : చందుర్తి**



చందుర్తి మండలం సనుగుల ప్యాక్స్ చైర్మన్ జలగం కిషన్ రావు మోకాలుకు శస్త్ర చికిత్స చల్మెడ ఆనందరావు వైద్య ఆసుపత్రిలో బుధవారం నిర్వహించగా, వారిని బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంఛార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి శస్త్ర చికిత్స విజయవంతంగా జరిగిందని, త్వరలోనే ఆరోగ్యం కుదుటపడుతుందని కిషన్ రావుకు వారు ధైర్యం చెప్పారు.

### మేడిపల్లి మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ

# కూతాడి నరసింహకి ఘన నివాళి

**నివాళులర్పించిన డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రష్ యాదవ్**

**వాస్తవం : మేడిపల్లి**

మేడిపల్లి మాజీ సర్పంచ్‌గా, మాజీ ఎంపీటీసీగా ప్రజలకు విశిష్ట సేవలందించిన కూతాడి నరసింహ బుధవారం ఉదయం పరమపదించారు. ఈ సందర్భంగా మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ నివాసానికి వెళ్లి, పార్థివ దేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు పర్యాయాలు సర్పంచ్గా ఎంపీటీసీగా మేడిపల్లి ప్రజలకు ఎంతో సేవ చేశారని, ఇది నిజాయితీకి కొన్ని కాసాయన నాయకుడుగా పనిచేశారని అన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



# వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి**

**వాస్తవం : గోదావరిఖని**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్ద పల్లి జోన్ గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ వర్షాలతో నాలాల ప్రవహించే నీరు రోడ్డుపై రావడంతో ఆ ప్రాంతాలను పెద్ద పల్లి డిసిపి బి రామ్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ అరుణ శ్రీ , మేయర్ మహంకాళి స్వామి, గోదావరిఖని ఏసిపి ఎం రమేష్ గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనా రెడ్డితో మల్కాపూర్, మెడికల్ కళాశాల, 5 ఇంక్లైన్, తదితర ప్రాంతలలో కలిసి వరదను పరిశీలించి జిల్లాలో భారీ వర్షాలతో వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం అయితే తప్ప బయటకు రావద్దని, అదే విధంగా అధికారులకు అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, భారీ వర్షాలు కురుస్తుందున వల్ల ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, చెరువులు నదుల వద్ద వరద ప్రవాహం అధికంగా ఉందని, వాటి



వద్దకి ఎవరు వెళ్లవద్దన్నారు. గోదావరి, మానేరు నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెరువులు, వాగులు, ప్రాజెక్టుల వద్దకు ప్రజలు, యువత వెళ్లకూడదన్నారు. వర్షం నీటి వల్ల రోడ్డుపై వాహనాలు స్కిడ్ అయ్యే ప్రమాదం ఉన్నందున, పరిమిత వేగంతో వాహనాలు నడపాలని సూచిం చారు. పిల్లలు, యువకులు చెరువులు నది దగ్గరకు సెల్ఫీలు తీసుకోవడానికి, ఈత కొట్టడానికి వెళ్లకుండా తల్లిదండ్రు లు దృష్టి సారించాలన్నారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవలం చడానికి జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని, ఎటువంటి సహాయం కావాలన్నా 100కి లేదా స్థానిక పోలీస్ అధికారులకి ఫోన్ చేయాలని డీసీపీ సూచించారు.

### టీడీఆర్ సమస్యల పరిష్కారానికి

# జయేష్ రంజన్‌ను కలిసిన ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్

**వాస్తవం : మేడిపల్లి :** టీడీఆర్ మార్కెట్ విలువల అమలు, అదనపు ఫ్లోర్ల అనుమతులు, సెట్‌బ్యాక్ మినహాయింపులు, అలాగే భవన నిర్మాణం లేఅవుట్ అనుమతులలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరుతూ ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ జే.టి. విద్యాసాగర్, సభ్యులు మోహన్ రావు, పి.ఏ.ఎస్. మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ, 2026 జూన్ 4కు ముందు భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తులు సమర్పించినప్పటికీ, ప్రస్తుతం అధికారులు సవరించిన మార్కెట్ విలువల ఆధారంగా టీడీఆర్ మొత్తాలను లెక్కించి అదనపు చెల్లింపులు (షార్ట్‌ఫాల్) చూపుతున్నారని తెలిపారు. దీంతో బిల్డర్లు, డెవలపర్లు తీవ్ర ఆర్థిక భారం ఎదుర్కొంటున్నారని వివరించారు. జూన్ 4కు



ముందు సమర్పించిన దరఖాస్తులకు అప్పటి అమల్లో ఉన్న మార్కెట్ విలువలనే వర్తింపజేయాలని, దరఖాస్తు సమర్పించిన తేదీ ఆధారంగా టీడీఆర్ విలువలు లెక్కించేలా భవన నిర్మాణ లేఔట్లో అవసరమైన సాంకేతిక మార్పులు చేపట్టాలని కోరారు. అదే విధంగా, ఇప్పటికే భవన నిర్మాణ అనుమతులు పొంది, అన్ని ఫీజులు చెల్లించి జీవో.168 ప్రకారం 10 శాతం మార్టిగేజ్ ప్రక్రియను పూర్తి చేసిన బిల్డర్లు, ప్రస్తుతం జీవో 95 ప్రకారం టీడీఆర్ అదనపు ఫ్లోర్లు, సెట్‌బ్యాక్ మినహాయింపుల కోసం సవరించిన దరఖాస్తులు సమర్పించేందుకు ప్రయత్నిస్తుండగా, భవన నిర్మాణ లేఔట్ లో వాటిని అంగీకరించకపోవడం వల్ల పనులు నిలిచిపోతున్నాయని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయడంతో పాటు, జీవో 95 అమలుపై ఉన్న సందిగ్ధతను తొలగించాలని, జిహెచ్ఎంసి హెచ్ఎండిఏ మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల అధికారులకు ఏకరీతి విధానాన్ని అమలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రంలోని అంశాలను ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ సానుకూలంగా స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి తగిన నిర్ణయం తీసుకునేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

### గంభీరావుపేట మండల కేంద్రంలో

# భారీ చోరీ



**వాస్తవం : గంభీరావుపేట**

గంభీరావుపేట మండల కేంద్రంలో భారీ చోరీ జరిగింది. కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో దుండగులు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించారు. ఈ ఘటనతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన పత్తి స్వామి కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు వెళ్లిన విషయం గమనించిన గుర్తు తెలియని దుండగులు అర్ధరాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న 9 తులాల బంగారం, 16 తులాల వెండి ఆభరణాలు, రూ.30 వేల నగదును దొంగలు అపహరించినట్లు బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే బుధవారం ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించగా, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ, ఎస్సై శ్రీకాంత్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తూ, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ చోరీ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# రోడ్డు భద్రతపై చర్యలు చేపట్టాలి

**వట్టిమల్ల ఉప సర్పంచ్ గంగారం సంపత్**



**వాస్తవం : కోనరావుపేట**

తరచు జరుగుతున్న ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు, బ్లింకర్ లైట్లు ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులకు బుధవారం కోనరావుపేట మండలం వట్టిమల్ల ఉపసర్పంచ్ గంగారం సంపత్ వినతి పత్రాన్ని సమర్పించారు. వట్టిమల్ల గ్రామ ప్రధాన రహదారి-సనుగుల ఎక్స్ రోడ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీప ప్రాంతంలో తరచు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంల ప్రజల ప్రాణ భద్రత కోసం వెంటనే రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. సంపత్ వెంట సాయి కుమార్ ఉన్నారు.

# కారు ఢీకొని మహిళ మృతి



**వాస్తవం:హుస్నాబాద్ :** రోడ్డు దాటుతున్న మహిళను వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటన హుస్నాబాద్ లో జరి గింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సాదుల యాదలక్ష్మి (59) భీమదేవరపల్లి మండలం మల్లారం కు వెళ్లి రాత్రి గం. 7 ప్రాంతంలో హనుమకొండ రోడ్డులో గల పెట్రోలు బంకు వద్ద బస్సు దిగింది. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఆమెను ఢీకొట్టింది. దీంతో ఎగిరి కింద పడిన ఆమెకు తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి చికిత్స నిమిత్తం అదే కారులో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలి స్తున్న క్రమంలోనే ఆమె మృతి చెందిందని తెలిపారు. కాగా మృతు రాలికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# గడువులోగా సర్ డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

**రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**
**హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**వాస్తవం: రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**



రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, ఎస్ఐఆర్ డిజిటలైజేషన్, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) పురోగతిని జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని సూచించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో నమోదై ఉంటే, వారిని సాధ్యమైనంత వరకు ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి తీసుకువచ్చేలా ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చేపట్టాలని ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... జిల్లాలో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియ 86.09 శాతం పూర్తయిందని తెలిపారు. మిగిలిన ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వేములవాడ ఆర్ డిఓ కెవిఎస్ బి కుమారి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, తహసీల్దార్లు మహేష్, జయంత్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, ఎలక్షన్ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

# గురు పూర్ణిమ ప్రత్యేక పూజలు చేసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే

**వాస్తవం : జూబ్లీహిల్స్**



గురు పూర్ణిమ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం జవహర్ నగర్ కృష్ణ కాంత్ పార్క్ సమీపంలో ఉన్న షిరిడి సాయి ద్వారకామాయి ట్రస్ట్ సాయి బాబా దేవాలయం లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి .నవీన్ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు దేవాలయం ట్రస్ట్ సభ్యులు ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్‌కి శాలువాతో ఘనంగా సన్మానించారు ఆలయ పండితులు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్‌కి తీర్థప్రసాదాలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్ర మంలో ట్రస్టు సభ్యులు సి.బాల ప్రకాష్, గోలి మల్లారెడ్డి , బరిగల జ్ఞానేశ్వర్ , రాజమ్మ,, రజిని, లక్ష్మి,,హేమ ,రమ్య పంతులు వికాస్, సునీల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలందరికీ గురుపూర్ణిమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో గురు పూర్ణిమ పూజలు

**వాస్తవం : అందోల్**



గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని జోగిపేట పట్టణంలోని షిర్డీ సాయి బాబా దేవాలయం, సత్య సాయి బాబా దేవాలయంలో పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు. ఇందులో సామూహిక సత్య నారాయణ వ్రతాలు కూడా చేశారు. ఈ పూజ కార్యక్రమాల్లో మాజీ ఏఎంసి చైర్మన్ డి బి నాగభూషణం టిఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం బందం రాములు, వీరేషం, మల్లేశం, వడ్ల రాములు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు .సత్య సాయి బాబా దేవాలయంలో సామూహిక సత్య నారాయణ వ్రతాలు నిర్వహించారు. రెండు దేవాలయాల్లో భక్తులు అందరికీ అన్న ప్రసాదం వితరణ కార్యక్రమం నిర్వహించారు .షిర్డీ సాయి బాబా ఆలయం లో వడ్ల సుధాకర్, రాములు అర్చకులు యోగేష్ ఆశీర్వచనం ఇచ్చారు.

# మంత్రుల పర్యటన సందర్భంగా పటిష్ట భద్రత ఏర్పాట్లు

**జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే**

**వాస్తవం: సిరిసిల్ల:** వేములవాడ, సిరిసిల్ల లో మంత్రుల బృందం గురువారం పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే తెలిపారు. ఈసందర్భంగా బుధవారం సాయం త్రం సిరిసిల్లలోని రగుడు బై పాస్ జంక్షన్,బస్ షెల్టర్ ప్రాంతాలను, వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో ట్యాంక్ బండ్ పార్క్ ప్రాంతాలను ఎస్పీ స్వయంగా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసంద ర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు ఆదేశించారు.ఎస్పీ వెంట డిఎస్పీ లు నాగేంద్రచారి, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐ లు శ్రీనివాస్, వీరప్రసాద్,ఎస్ఐలు ఉన్నారు.



## మాగంటి సునీతని కలిసిన
# బీఆర్ఎస్ కార్యకర్తలు



**వాస్తవం : జూబ్లీహిల్స్**

జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎర్రగడ్డ డివిజన్‌లోని ఛత్రపతి శివాజీ నగర్‌కి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ మాగంటి సునీత గోపీనాథ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. డివిజన్‌కి వివిధ అంశాలకు సంబంధించిన చర్చలు వారిరువురి మధ్య చర్చకు వచ్చాయి.

# గుర్తుతెలియని వ్యక్తి మృతి

**వాస్తవం : రామచంద్రపురం**



రామచంద్రపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని బిహెచ్ఈఎల్ చౌరస్తా మెహదీపట్నం బస్ స్టాండ్ వద్ద సుమారు 50 నుండి 60 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి ఫిట్స్ రావడంతో కిందపడి అపస్మారక స్థితిలో ఉండగా అక్కడే ఉన్న స్థానికులు అతనిని గమనించి 108 అంబులెన్స్ ద్వారా అతడిని పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ గుర్తు తెలియని వ్యక్తి పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రి నందు చికిత్స పొందుతు తేదీ 28 తేదీన ఉదయం 6గం!ల సమ యంలో మరణించినాడు. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తించినట్లు యితే, దయచేసి ఆర్‌సీ పురం పోలీస్ స్టేషన్ ఫోన్ 87126 63199, 8712568227లకు సమాచారం అందించగలరు.

## టోల్ గేట్ యాజమాన్యానికి
# పంచాయతీ నోటీసు

**-స్పందించకుంటే**
**పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చర్యలు : కార్యదర్శి రాకేష్**



**వాస్తవం : కాటారం**

కాటారం మండలంలోని మేడిపల్లి టోల్ గేట్ యాజమాన్యానికి మేడిపల్లి గ్రామపంచాయతీ నోటీసు జారీ చేసింది. టోల్ గేట్ వద్ద కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, జాతీయ రహదారి (ఎన్‌హెచ్--353సీ) ఇరువైపులా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడం, సైడ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, రహదారి పక్కన మట్టి, చెత్త తొలగించకపోవడం వల్ల వర్షపు నీరు నిల్వ ఉండి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని నోటీసులో పేర్కొన్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది నిల్వ నీటిని తొలగించి పరిసరాలను శుభ్రం చేసిన అనంతరం టోల్ గేట్ యాజమాన్యానికి నోటీసు అందజేశారు. డ్రైనేజీ వ్యవస్థను వెంటనే ఏర్పాటు చేయడంతో పాటు రహదారి ఇరువైపులా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి, వర్షపు నీరు నిల్వ కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని ఆదేశించారు.నోటీసు అందిన మూడు రోజుల్లోపు వివరణ సమర్పించాలని, స్పందించకపోతే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని మేడిపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి రాకేష్ హెచ్చరించారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో

# నిర్లక్ష్యాన్ని సహించం

**సమీక్ష సమావేశంలో అధికారులకు దిశా నిర్దేశం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**విద్యుత్ శాఖ ఏఈ గైర్ హాజరుపై తీవ్ర ఆగ్రహం**

**వాస్తవం : హుస్నాబాద్ :**

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన గ్రామపంచాయతీ అభివృద్ధి కార్యక్రమాల సామర్థ్య పెంపు పై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అన్ని గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, మంజూరైన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, తాగునీటి సమస్యలు, వ్యవసాయ రంగం, విద్యుత్ సరఫరా, రవాణా సౌకర్యాలు, పంచాయతీరాజ్, రోడ్లు, విద్యా రంగం, ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ముందస్తు అనుమతి లేకుండా సమావేశానికి గైర్హాజరైన విద్యుత్ శాఖ ఏఈ తీరుపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సభలకు సైతం ఏఈ హాజరుకావడం లేదని సర్పంచులు మంత్రి దృష్టికి తీసుకురాగా, ప్రజలకు అందుబాటులో ఉండకుండా నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శాతవాహన యూనివర్సిటీ పనుల కోసం రూ. 15 లక్షలు చెల్లించినప్పటికీ ఇప్పటివరకు విద్యుత్ కనెక్షన్ ఎందుకు ఇవ్వలేదని మంత్రి అధికారులను నిలదీశారు. సంబంధిత సమస్యను వెంటనే పరిష్కరించి విద్యుత్ కనెక్షన్ అందించాలని ఆదేశించారు.హుస్నాబాద్ మండలంలో మంజూరైన 240 ఇందిరమ్మ ఇండ్లలో ఇప్పటికే 210 ఇండ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. మిగిలిన ఇండ్ల పనులను వెంటనే ప్రారంభించాలని, నిర్లక్ష్యం చేస్తే ఆయా ఇళ్ల మంజూరులను రద్దు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేసిన గ్రామాలకే తదుపరి విడతలో ప్రాధాన్యతనిస్తూ అదనపు ఇండ్లను మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖలకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, పెండింగ్ టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో మంజూరైన అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పొట్లపల్లి, పందిళ్ళ, కోహెడ రూట్లలో తక్షణమే ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఈ ఊరికి బస్సు రాలేదు అనే మాట నా దృష్టికి రావద్దని స్పష్టం చేశారు. ప్రతి గ్రామానికి రవాణా సౌకర్యం అందేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో, తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. రైతులకు ఆరుతడి పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించాలని, తక్కువ నీటితో అధిక దిగుబడి వచ్చే పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగుకు అందుబాటులో ఉన్న సబ్సిడీలు, విత్తనాలు, ఎరువులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జ్ పిట్లు ఏర్పాటు చేసి భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో జలశక్తి సంరక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, నీటి సంరక్షణలో ముందుండే గ్రామాలు అభివృద్ధిలోనూ ముందంజలో ఉంటాయని పేర్కొన్నారు. రెండున్నర ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉన్న అర్హులైన రైతులు ప్రభుత్వ నిబంధనల మేరకు రూ. 2.50 లక్షల సహాయంతో వ్యవసాయ బావులను తవ్వుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్య, సౌకర్యాలు అందించడంలో అధికారులు, ప్రజాప్రతి నిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించి, మంజూరైన పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతి సమస్యను సమష్టిగా చర్చించి పరిష్కరించుకుందామని, హుస్నాబాద్ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ కొండల్ రెడ్డి, ఎంపీడీఓ సురేష్, ఏఎంసీ చైర్మన్ తిరుపతి రెడ్డి, ఫ్యాక్స్ చైర్మన్ శివయ్య పాల్గొన్నారు.




# కన్నెపల్లిలో నీళ్ళున్నా... ద్వేషంతోనే పారిస్తలేరు

**రైతుల కంటే ప్రతీకారాలకే పెద్దపీట**

**రేవంత్ సర్కార్ తీరు**

**మాజీ మంత్రి బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి**

**జగిత్యాల, జులై 29 (వాస్తవం)**

కన్నెపల్లి పంపు హౌస్‌లో పుష్కలంగా నీళ్ళున్నా కేసీఆర్‌పై ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పెంచుకొన్న ద్వేషంతోనే నీళ్లను పారిస్త లేరని మాజీ మంత్రి బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి అన్నారు. బుధవారం రాయికల్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జీవన్ రెడ్డి మాట్లాడారు. కన్నెపల్లి పంపు హౌస్‌లో నీళ్ళుండి తరలింపు చేసే అవకాశం ఉన్నా కేవలం కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న అక్కసుతో నీటిని రైతుల పొలాలకు పారిస్తలేరన్నారు. రైతులపై రేవంత్ రెడ్డికి దయ లేకున్నా వాన దేవుడికి ఉన్న దయతో వర్షాలు కురియడంతో రైతాంగానికి కొద్దిగా ఊరట కలిగిస్తోందన్నారు. ఖరీఫ్ పంట సాగు ప్రశ్నర్థకంగా మారిన నేపథ్యంలో రైతులకు అల్ప పిడనంతో వర్షాలు కురవడం కాస్త మేలయిందన్నారు. కురుస్తున్న ఈ వర్షాలతో ఎదిగిన నారు నాటు వేసుకొనే అవకాశం ఉందని ముఖ్య మంత్రి ఇప్పటికైనా విద్యుత్ సమస్య ఉత్పన్నం కాకుండా గతంలో కేసీఆర్ ఇచ్చిన తరహాలో 24 గంటల కరెంట్ ఇచ్చే ఏర్పాట్లు చేయాలని జీవన్ రెడ్డి సూచించారు. ప్రధానంగా అదుగుమందు 20-20 ఎరువు రకం ధర రెండు వేల 150 రూపాయలు, డి. ఏ. పి 1 వేయి 950 రూపాయలుగా ఉందని కొరత లేకుండా బ్లాక్ కాకుండా అందరికి అందుబాటులో ఉండేలా చూస్తూ యూరియా బుకింగ్ యాప్‌ను తొలగించాలని కోరారు. నిన్నటి వరకు నిర్లక్ష్యం వహించిన రాష్ట్ర ప్రభుత్వం దేవుని కరుణను చూసైనా రైతాంగానికి కాస్త మేలుచేసేలా ప్రభుత్వ నిర్ణయాలు వుండాలని కోరారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ జడ్పి చైర్మన్ దావ వసంత సురేష్,నాయకులు సి కే రెడ్డి, మల్లేష్,గోపి రాజిరెడ్డి,మైపాల్, హరీష్ రావు,శ్రీధర్ రెడ్డి, రవి ఉన్నారు.



# 20 ఏండ్లుగా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే

**అభివృద్ధికి నోచుకోని కోమటిచేను గ్రామం**

**డ్రైనేజీ కాలువలు కట్టించాలని దరఖాస్తు పెడితే ఇంకుడు గుంతలు తవ్వించుకోవాలని ఉచిత సలహాలు ఇస్తున్న స్థానిక అధికారులు**

**మురికి నీటితో వర్షపు నీరు కలిసి ఇండ్ల ముందు చెరువుల్లా తయారవుతున్న వైనం**

**గ్రామంలో సిసి రోడ్లు నిర్మించాలని జిల్లా అధికారులకు అర్జీ**

**నిర్లక్ష్యంలో గ్రామపంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు**

**వాస్తవం:కాసిపేట**

మంచిర్యాల జిల్లా, కాసిపేట మండలం,కోమటిచేను గ్రామం గత 20 ఏళ్లుగా ఎంతమంది ప్రజా ప్రతినిధులు మారిన ఎంతమంది గ్రామపంచాయతీ అధికారులు వచ్చినా..సరైన అభివృద్ధికి మాత్రం నోచుకోలేకపోయిందని కోమటి చేను గ్రామ పంచాయతీ ప్రజలు వాపోతున్నారు. వివరాల్లోకెళ్తే గత 30 సంవత్సరాల క్రితం కోమటి చేను గ్రామపంచాయతీలో డ్రైనేజీ కాలువలు నిర్మించడం జరిగిందని కానీ తర్వాతి కాలంలో ఆ డ్రైనేజీలను సరిగ్గా నిర్వహించలేకపోవడం వాటిలో పడిన పూడిక తీయకపోవడం వలన అనతి కాలంలోనే వాటిలో దుమ్ము ధూళి రాళ్లూరప్పలు పడి కూరుకుపోయినాయని దాని మరమ్మత్తులు సరిగ్గా నిర్వహించకపోవడం వలన అవి కనుమరుగైపోయాయని స్థానిక ప్రజలు చెప్పుకొచ్చారు. అదేవిధంగా తమ గ్రామానికి డ్రైనేజీ కాలువలు సిసి రోడ్లు నిర్మించాలని జిల్లా అధికారులకు అర్జీ పెట్టుకున్న మండల, స్థానిక అధికారులు ప్రజా ప్రతినిధులు మాత్రం నిర్లక్ష్యం చేస్తూ పెడచెవిన పెడుతున్నారని,అదేవిధంగా డ్రైనేజీ కాలువలు గ్రామంలో నిర్మించాలని అడిగితే డ్రైనేజీ కాలువలు నిర్మించే రూల్ లేదని ఎవరి ఇంటి ఆవరణలో వారు ఇంకుడు గుంతలను తవ్వించుకోవాలని ఉచిత సలహాలు ఇస్తున్నారని గ్రామపంచాయతీ ప్రజలు వాపోతున్నారు.ఇక నిన్న పడిన భారీ వర్షం వలన వర్షపు నీరు పోయే దారి లేక పడిన ప్రతి వర్షపు చుక్క ఇండ్ల మధ్యలో చేరి సీసీ రోడ్డు లేకపోవడం వలన మట్టి రోడ్డుపై నిలిచి అందులో విష సర్పాలు తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నయని, ఇక ఇంటి చుట్టూ వర్షపు నీరు నిల్వ ఉండడంతో నిత్యావసర వస్తువుల కోసం అదేవిధంగా పనుల కోసం బయటికి వెళ్లే వారు ఆ నిలిచి ఉన్నటువంటి వర్షపు నీరు దాటి బయటికి రావాలంటే ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని రావలసినటువంటి పరిస్థితి ఏర్పడిందని,ఇంత జరిగిన గ్రామపంచాయతి అధికారులు కానీ ప్రతినిధులు కానీ వచ్చి పరిస్థితిని చూసి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినటువంటి సందర్భాలు లేవని, గ్రామపంచాయతీ అధికారులు ప్రజాప్రతినిధులు 'నిమ్మకు నీరెత్తినట్లు "వ్యవహరిస్తున్నారని తమ బాధని వెళ్లగక్కుతున్నారు. ఇకనైనా ప్రజానష్టం జరగకముందే సంబంధిత గ్రామ,మండల, జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి గ్రామ పరిస్థితిని స్వయంగా పరిశీలించి,తగిన చర్యలు తీసుకోవాలని లేనియెడల, గ్రామ ప్రజలమంత ప్రజా సంఘాలతో కలిసి పెద్ద మొత్తంలో ఆందోళన చేయవలసి వస్తుందని, అదేవిధంగా మానవహక్కు సంఘాలకు ఫిర్యాదు చేయవలసి వస్తుందని హెచ్చరిస్తున్నామన్నారు.





# తహసీల్దార్ ఆదేశాలు బేఖాతరా?


**ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలపై వివాదం**

**సర్వే నంబర్లు 329/1 నుంచి 329/10 వరకు అనుమతులు ఇవ్వొద్దని లేఖ.. అయినా వందలాది నిర్మాణాలపై ఆరోపణలు**

**వాస్తవం : కుత్బుల్లాపూర్ ఆర్సీ**

కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం గ్రామంలోని సర్వే నంబర్లు 329/1 నుంచి 329/10 వరకు ఉన్న భూములకు సంబంధించి అప్పటి తహసీల్దార్ జారీ చేసిన ఆదేశాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.ఈ భూములను ప్రభుత్వ భూములుగా పరిగణిస్తూ ఎలాంటి భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయరాదని 2024 సెప్టెంబర్ 13న జీహెచ్ఎంసీ గాజులరామారం సర్కిల్-26 (ప్రస్తుత సీఎంసీ సర్కిల్-57) టౌన్ ప్లానింగ్ అధికారులకు తహసీల్దార్ లిఖితపూర్వకంగా ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.తహసీల్దార్ లేఖలో సర్వే నంబర్ 329 మొత్తం 255 ఎకరాల 28 గుంటల విస్తీర్ణంలో "గైరాన్ సర్కార్" (ప్రభుత్వ భూమి)గా రెవెన్యూ రికార్డుల్లో నమోదైందని పేర్కొన్నారు. అలాగే సర్వే నంబర్లు 329/1 నుంచి 329/10 వరకు ఉన్న భూములు స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22-ఏ కింద నోటిఫై చేయబడ్డాయని స్పష్టం చేశారు.అదేవిధంగా, ఈ భూములకు సంబంధించిన వివాదం ప్రస్తుతం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున ఎలాంటి భవన నిర్మాణ అనుమతులు జారీ చేయరాదని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించినట్లు లేఖలో పేర్కొన్నారు.అయితే స్థానికుల ఆరోపణల ప్రకారం, ఈ స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, సర్వే నంబర్లు 329/1 నుంచి 329/10 పరిధిలో వందలాది భవనాలు నిర్మాణం చేపట్టినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో





REVENUE DEPARTMENT

From
Sri Abdul Rahman Khan,
Tahsildar,
Quthbullapur Mandal.

To
The Deputy Commissioner,
Gajularamaram Circle- 26,
GHMC, Hyderabad.

Lr.No.B/1415/2024. Dated: 13 .09.2024.

Sir,

Sub:Gajularamaram Circle26 -Town Planning Section -Request to give Clrification in respect of Sy No.329/1 to 329/10 of Gajularamaram village. Quthbullapur Mandal, Medchal Malkajgiri District Whether to issue building permissions or not- Reply-Reg

Ref: 1.Lr No. 308/TPS/C26/KPZ/GHMC/2024 dt 30.08.2024 of DC, C-26, GHMC.

***

Kind attention is invited to the subject and reference cited, wherein the Deputy Commissioner, Circle -26, GHMC has sought clarification on the whether to accord permissions in Sy.No 329/1 to 329/10.

In this regard, it is informed that as per Nakal Sethwar of Gajularamaram Village available, the Sy No.329 total admeasuring Ac.255.28 gts is recorded as "Gairan Sarkar"( Government land) and also the said Sy No.329/1 to 329/10 of

రెవెన్యూ శాఖ, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం లోపించిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.తహసీల్దార్ అధికారిక లేఖ వెలుగులోకి రావడంతో గతంలో జారీ చేసిన భవన అనుమతులు, ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణాలు, సంబంధిత అధికారుల బాధ్యతపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు, ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు అధికారికంగా స్పందించాల్సి ఉంది. అలాగే ప్రభుత్వ భూముల పరిరక్షణ,అక్రమ నిర్మాణాల నివారణకు సంబంధించి ఉన్నతాధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# దంతాలపల్లిలో ఇంటిపై కూలిన వృక్షం

**తృటిలో తప్పిన ప్రాణాపాయం.. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి**



**వాస్తవం : కాటారం**

కాటారం మండలంలో కురిసిన భారీ వర్షాలు రెండుకుటుంబాలను తీవ్ర ఇబ్బందులకు గురి చేశాయి.చిదేనేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దంతాలపల్లిలో నాగురపు పోశమ్మ ఇంటిపై భారీ వృక్షం కూలిపోవడంతో ఇల్లు దెబ్బతింది. ఘటన సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తున్నప్పటికీ అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.విషయం తెలుసుకున్న సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి సంఘటనా స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం ద్వారా తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.మరోవైపు ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన శ్రీరాముల మల్లయ్య ఇంటి గోడ భారీ వర్షాలకు కూలిపోయింది.ఈ ఘటనలో కూడా ప్రాణనష్టం జరగకపోయినా ఇల్లు దెబ్బతింది. ఘటన స్థలాన్ని 10వ వార్డు సభ్యుడు మానేమ్ రాజబాపు, గ్రామ యువత పరిశీలించి బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అధికారులను కోరారు.

# ఎన్ని పార్టీలు వచ్చిన మా బ్రతుకులు ఇంతే అంటున్న నక్కలపల్లి ప్రజలు

**వాస్తవం : చెన్నూర్ ఆర్సీ**

కోటపల్లి మండల్ నక్కలపల్లి. మల్లంపేట మార్గమధ్యంలో ఉన్న లోతు వాగు ఎన్ని పార్టీలు వచ్చిన మా బ్రతుకు ఇంతే అంటున్న నక్కలపల్లి ప్రజలుప్రతి వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. వాగు దాటాల్సిన పరిస్థితిలో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది.ఈ సమస్యకు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ము కానీ ఏ నాయకుడు మాకు ఈ వాగు నుండి బ్రిడ్జి మాత్రం తేవడం లేదు ఓట్ల కు మాత్రం వస్తున్నారు.శాశ్వత పరిష్కారం అవసరం. ఎన్నో సంవత్సరాలు గా ఉత్తరాల రాసినప్పటి నుంచి కంప్యూటర్ల యుగం వరకు మా బ్రతుకులు ఇలాగే ముగుస్తా యా ఎన్నో పార్టీలు ఎందరో నాయకులు వచ్చారు పోయారు కానీ లోతు వాగు బ్రిడ్జి మాత్రం తేలేక పోయారు ఇకనైనా మాకోసం పట్టించుకొని బ్రిడ్జి సాంక్షన్ చేస్తారని నక్కలపల్లి ప్రజలు కోరుకుంటున్నాము.



ఐ ఎఫ్ టి యు డివిజన్ ప్రెసిడెంట్ రమేష్ మాసాని,



# బస్టాండా? మందు బాబుల అడ్డానా?

**ప్రయాణికులు కూర్చునే గద్దెలపై ఖాళీ సీసాలు, గుడుంబా ప్యాకెట్లేంటి**

**తాత్కాలిక శుభ్రత కాదు ,నిత్య శుభ్రత కావాలంటున్న ప్రయాణికులు**

**పట్టణ బస్టాండ్‌ను ఊరి 'దిష్టిబొమ్మగా' మారుస్తున్న వైనం**

**వాస్తవం : మందమర్రి**
**(మోకనపల్లి బద్రి )**



మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణం లోని మార్కెట్ ఏరియాలో గల ప్రయాణికుల ప్రాంగణం నేడు మందు సీసాలు, గుడుంబా ప్యాకెట్లే కాకుండా తాజాగా గంజాయి బాబులకు అడ్డాగా మారిందంటున్నారు పట్టణ ప్రయాణికులు, దీనికి తోడు ప్రాంగణమంతా విపరీతమైనటువంటి పిచ్చి మొక్కలు ,చెత్తా చెదారం కుప్పలుగా పేరుకుపోయి అప రిశుభ్రతకు ఆనవాలుగా మారి,మందమర్రి పట్టణ నడి బొడ్డున ప్రయాణికుల ప్రాంగణంగా పిలవబడే బస్టాండును ఊరి దిష్టిబొమ్మగా మార్చడం ఎంతవరకు సమంజసం అంటున్నారు పట్టణ ప్రజలు. లక్షల రూపాయలు పెట్టి నిర్మించిన ప్రయాణ ప్రాంగణం,ప్రయాణికులు కూర్చోవడానికి వీలుగా లేకపోవడం దారుణం అంటున్నారు. మూత్రశాలలు నిర్మించారు కానీ.. ప్రారంభానికి నోచుకోవడం లేదంటూ ఇప్పటికే పట్టణ సబ్బండ వర్గాల ప్రజలు కొందెక్కి బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఈ మూత్రశాలలు ప్రారంభం గాక, ప్రయాణికులు అదేవిధంగా వాణిజ్య,వ్యాపార కేంద్రాలకు నిత్యం వస్తున్న కస్టమర్లు బస్టాండ్ ప్రాంతం చుట్టూ ఎక్కడబడితే అక్కడ మలవిసర్జన చేస్తూ.. ఆ ప్రాంగణమంతా దుర్వాసనతో రోగాల రొంపుగా మారుస్తున్నా.. పట్టణ నాయకులకు గాని పైరవీదారులకు గాని కనిపించడం లేదు .పట్టణ ప్రజలకు ఉపయోగపడే ప్రాంతం.. ఎన్నో సమస్యలతో తల్లడిల్లుతున్నా.ఏ ఒక్క చోట -బడా లీడర్స్ పట్టించుకున్న పాపాన పోలేదు. బస్టాండ్ బస్సు తెప్పించాం ,మా పని అయిపోయిందంటూ చేతులెత్తేశారు.పరిశుభ్రతను మరిచారు. ఇది ఇలానే..చిన్న చూపుకు గురైతే ..కొద్దిరోజుల్లో ఈ ప్రాంతం అవాంఛనీయ సంఘటనలకు అడ్డాగా మారి, పట్టణ ప్రజలకు ,ప్రయాణికులకు ,పోలీసులకు చాలా సమస్యలు తెచ్చి పెడుతుంది అనడంలో సందేహం లేదు. ఏ సమస్యనైనా.. ఆదిలోనే తుంచివేయాలి మన కెందుకులే ,చూద్దాములే ,పోనీలే ,తర్వాత అంటూ వాయిదాలు వేస్తే ..జరగరాని అవాంఛనీయ సంఘటనలు సంభవించి దోపిడీలకు ,దొంగతనాలకు, మర్డర్లకు ,మానభంగాలకు, బెదిరింపులకు ఆద్యం పోసినట్లు అవుతుందంటున్నారు పట్టణ మేధావులు,విద్యావేత్తలు,పట్టణ సబ్బండ వర్గాల ప్రజలు. ఇప్పటికైనా.. ఈ బస్టాండ్ ప్రాంతాన్ని సురక్షితంగా ఉంచాలంటూ అభిప్రాయపడుతున్నారు.

# భారీ వర్షానికి ఇల్లు కూలి ముగ్గురికి గాయాలు

**బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎంబరి సజన్ కుమార్**

**వాస్తవం : చెన్నూర్ ఆర్సీ**



మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం ఆలుగామ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి ఆత్రం మంతయ్యకు చెందిన ఇల్లు పూర్తిగా కూలి నేలమట్టమైంది. ప్రమాద సమయంలో కుటుంబసభ్యులు ఇంట్లోనే ఉండటంతో గోడలు కూలి వారిపై పడటంతో మంతయ్య భార్య లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడింది. పెద్ద కుమారుడు అజయ్ కాలికి తీవ్ర గాయాలు కాగా, చిన్న కుమారుడు అనిల్ చేతికి తీవ్ర గాయాలయ్యాయి.వారికి ఉన్న ద్విచక్ర వాహనం పూర్తిగా పాడైపోయింది. వెంటనే గాయపడిన వారిని అంబులెన్స్‌లో చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న కోటపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఎంబరి సజన్ కుమార్, బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ విషయాన్ని మంత్రి వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం తరపున బాధిత కుటుంబానికి అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే తహసీల్దార్ రాఘవేందర్ రావుకు సమాచారం అందించి, ప్రభుత్వం నుంచి తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సజన్ కుమార్ మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి ఎల్లప్పుడూ ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పల్లె సత్తయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఓల్వోజీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

### సెయింట్ థామస్ హైస్కూల్‌లో

# రోడ్డు భద్రత హెల్మెట్ వినియోగంపై అవగాహన సదస్సు

**వాస్తవం : ఎల్కతుర్తి**



ఎల్కతుర్తిలోని సెయింట్ థామస్ హైస్కూల్‌లో విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు బుధవారం రోడ్డు రవాణా -- టూ వీలర్ హెల్మెట్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రవాణా అధికారి (డీటీఓ) అఫ్రీన్ సిద్దిఖీ,అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వైష్ణవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డీటీఓ అఫ్రీన్ సిద్దిఖీ మాట్లాడుతూ, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ జరిమానాల నుంచి తప్పించుకోవడానికి మాత్రమే కాదని, ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని తెలిపారు. హెల్మెట్ ధరించడం వల్ల తలకు తీవ్ర గాయాల నుంచి రక్షణ లభిస్తుందని,హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల చిన్న ప్రమాదం కూడా ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని వివరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు,కుటుంబ సభ్యులు ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతిసారీ హెల్మెట్ ధరించేలా గుర్తు చేయాలని సూచించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, నిర్లక్ష్యంగా వాహనం నడపడం,మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి ప్రమాదకర అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.పాఠశాల కరస్పాండెంట్ పుష్కూరి కార్తీక్ రావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించే ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. చిన్న వయస్సులోనే ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ ప్రాముఖ్యత, రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తే వారు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. విద్యార్థులు పాఠశాలలో నేర్చుకున్న విషయాలను తమ కుటుంబ సభ్యులకు తెలియజేసి సమాజంలో రోడ్డు భద్రతపై చైతన్యం తీసుకురావాలని కోరారు.ప్రభుత్వం,రవాణా శాఖ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలను ప్రతి పాఠశాలలో తరచూ నిర్వహించాలని, విద్యార్థుల ద్వారా ప్రతి కుటుంబానికి రోడ్డు భద్రత సందేశం చేరేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఇటువంటి కార్యక్రమాలకు సెయింట్ థామస్ హైస్కూల్ యాజమాన్యం ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మర్రి అశోక్, వైస్ ప్రిన్సిపల్ లింగం మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతి, ఉపాధ్యాయులు లావణ్య, సరిత, సురేష్, ఆశా బేగం, రమేష్, సుమలత, లత, కృష్ణ, కవిత, కళ్యాణి, స్వప్న తదితరులు, పాఠశాల సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

### 108 అంబులెన్స్‌లోనే సురక్షిత ప్రసవం

# తల్లీబిడ్డలు క్షేమం



**వాస్తవం : భూపాలపల్లి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గాంధీ .నగర్ గ్రామానికి చెందిన జెల్ల అంజలి (20)కు మంగళవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న 108 అంబులెన్స్‌లో అంజలి ని భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలోనే ప్రసవ నొప్పులు తీవ్రతరమయ్యాయి. పరిస్థితిని గుర్తించిన అంబులెన్స్‌లో విధుల్లో ఉన్న ఈఎంటీ చంటి సమయస్ఫూర్తితో వ్యవహరించి, అంబులెన్స్‌లోనే సురక్షితంగా ప్రసవం నిర్వహించారు. అంజలి పండంటి మగబిడ్డకు జన్మనివ్వగా, తల్లీబిడ్డలు ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.అనంతరం మెరుగైన వైద్య పరీక్షలు,సంరక్షణ కోసం వారిని భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా ప్రసవాన్ని విజయవంతంగా నిర్వహించిన ఈఎంటీ చంటి, అంబులెన్స్ పైలెట్ రాజేందర్ సేవలను స్థానికులు, కుటుంబ సభ్యులు అభినందించారు. అత్యవసర సమయంలో సకాలంలో స్పందించి సేవలందించిన 108 సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

### కోటపల్లి మండల్ అర్జున్ గుట్ట ప్రాంతాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**వాస్తవం : చెన్నూర్ ఆర్సీ**

మంచిర్యాల జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో 29-07-2026న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కోటపల్లి మండలంలోని అర్జున్ గుట్ట, ప్రాణహిత నది సందర్శించి పరిస్థితిని పరిశీలించారు వరద ప్రభావంతో ప్రమాదం సంభవించే అవకాశం ఉన్న ప్రాంతాలను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.అలాగే అర్జున్ గుట్ట సమీపంలోని ప్రభుత్వ పాఠశాల భవనాన్ని పాత ఇండ్లను పరిశీలించి, భవనం శిథిలావస్థలో ఉండటంతో విద్యార్థులు, గ్రామస్థుల భద్రత దృష్ట్యా తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాణహిత నది,లోతట్టు ప్రాంతాలు,వరద నీటిలోకి వెళ్లవద్దని కలెక్టర్ సూచించారు.ఈ పర్యటనలో కోటపల్లి అర్జున్ గుట్ట ఎమ్మార్వో, ఎంపీడీవో, చెన్నూరు సీఐ,కోటపల్లి ఎస్ఐ,పోలీసు బృందం ఎస్ డి ఆర్ ఎఫ్.బృందం,రాపన్‌పల్లిగ్రామ సర్పంచ్ అట్టెల ప్రభాకర్, గ్రామపంచాయతీ కార్యదర్శి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు బోయిని నగేష్ దొర మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ల సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్ల సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్ల హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం:: 9618616110

# అడవుల పెంపకం ప్రజలందరి బాధ్యత

### తిమ్మాపూరు ఎక్సైజ్ ఎస్ఐ భారతి

**వాస్తవం : చిగురుమామిడి**

ప్రతి ఒక్కరు మొక్కలు నాటి చెట్లను పెంచడంతో భూమిపై పర్యావరణ సమతుల్యతను పెంపొందించిన వారవుతారని తిమ్మాపూరు ఎక్సైజ్ ఎస్ఐ భారతి తెలిపారు.చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లెలో 'వన మహోత్సవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన తిమ్మాపూర్ ఎక్సైజ్ ఎస్ఐ భారతి సర్పంచ్ కవితతో కలిసి గ్రామ చెరువు కట్టకు ఇరువైపులా ఖర్జూర,ఈత,వివిధ మొక్కలను నాటారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వన మహోత్సవాన్ని దేశంలో ప్రతి సంవత్సరం జూలై మొదటి వారంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెట్ల పెంపకం పండుగ అన్నారు. ప్రజలు మొక్కలు నాటడంతో పర్యావరణాన్ని రక్షించడం, అటవీ సంపద పెరుగుతుందని,భూ గర్భజలాలు పెరుగుతాయని, పర్యావరణ సమతుల్యత కాపాడబడుతుందన్నారు.నేల కోత నివారించబడుతుందన్నారు.పండ్ల మొక్కలతో ప్రజలకు ఆహారో త్పత్తులు లభిస్తాయని,పశువులకు జంతువులకు పక్షులకు మేత అందుతుందని ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని పేర్కొన్నారు.'వన్ మహోత్సవ్' అడవుల పెంపకం కార్యక్రమాన్ని 1950 వ సంవత్సరంలో అప్పటి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి డాక్టర్ కె.ఎం.మున్షి ప్రారంభించారని తెలిపారు.దేశంలో వర్షాకాలం నైరుతి రుతుపవనాలు ప్రారంభమయ్యే సమయం కావడంతో మొక్కలు త్వరగా పెరగడానికి జూలై మొదటి వారాన్ని ఎంపిక చేశారన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వెంకటేశం గౌడ్,మంద శ్రీనివాస్,అన్నవేణి శ్రీనివాస్,మాజీ సర్పంచ్ వెంకటేష్,పంచాయతీ కార్యదర్శి సంపత్,ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్,మహిళా సమైక్య సిఎలు లత,రమ,గౌడ సంఘ సభ్యులు మధు,వెంకటేశం,శేఖర్,బిక్షపతి,రాజేశం సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



# రైతులపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు భారం తగ్గించాలి

### సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి

**వాస్తవం : ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండలంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.రైతులు వినియోగించే కాంప్లెక్స్ ఎరువుల ధరను ?1,300 నుంచి 2,100కు పెంచడం రైతులపై తీవ్రమైన ఆర్థిక భారాన్ని మోపే చర్య అని ఆయన విమర్శించారు. ఇప్పటికే పెరిగిన సాగు ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఎరువుల ధరల పెంపు మరింత భారంగా మారుతుందని పేర్కొన్నారు.ఇప్పటివరకు సహకార సంఘాలకు ఎరువుల రవాణా ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించేదని, అయితే ఇటీవల జారీ చేసిన జీవో ద్వారా ఆ సౌకర్యాన్ని తొలగించడంతో సహకార సంఘాలపై అదనపు భారం పడుతోందని తెలిపారు. ఒక లారీ ఎరువులు (సుమారు 450 బస్తాలు) తెప్పించేందుకు దాదాపు ?15 వేల వరకు రవాణా ఖర్చు అవుతోందని, ఈ భారం చివరకు రైతులపైనే పడే పరిస్థితి ఏర్పడిందని వివరించారు.ప్రభుత్వం, సంబంధిత అధికారులు, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి గతంలో అమలులో ఉన్న విధంగానే ఎరువుల రవాణా ఖర్చును ప్రభుత్వమే భరించేలా చర్యలు తీసుకోవాలని గుండారపు కృష్ణారెడ్డి కోరారు.ఈ అంశంపై సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేశారు.



# గురు పౌర్ణిమ ఉత్సవం

**వాస్తవం : గోదావరిఖని**

శ్రీ శ్రీ శ్రీ కృష్ణార్జున గీతా మందిరంలో గురు పౌర్ణిమఉత్సవాలు రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 37 డివిజన్ హనుమాన్ నగర్ లో గల శ్రీ శ్రీ శ్రీ కృష్ణార్జున గీతా మందిరంలో బుధవారం రోజున గురుపూర్ణిమను పురస్కరించుకొని ఎడతెరిపి లేని వర్షంలో కూడా అంగరంగ వైభవంగా గురుపూజ ఉత్సవాలను ప్రారంభించి భజన, నిష్కల్మష ఆనంద పోతరాజు కళావతాంబ చంద్రయ్య చంద్ర ఆర్యుల గురువు పూజకార్యక్రమం. శ్రీశ్రీశ్రీ జగద్గురు శ్రీ కృష్ణార్జున పూజ నిర్వహించి అన్నదాన కార్యక్రమం సుమారుగా 200 మందికి భోజనాలు ఏర్పాటు చేయడం జరిగింది ఈ ఉత్సవాలను ఆలయ అర్చకులు నరసింహ చారి,వ్యవస్థాపక కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు నాగుల అమలానంద స్వామి ఉపాధ్యక్షులు లింగ బత్తుల రమేష్ ప్రధాన కార్యదర్శి మహంకాళి సంపత్ సంయుక్త కార్యదర్శి బొజ్జ పురుషోత్తం కోశాధికారి మిండే ఓదెలు కార్యనిర్వహకులు దాసరి మొగిలి దుబాసిలింగయ్య బూడిద లింగయ్య వైనాల భారతి మారపల్లి సారమ్మ కనక లక్ష్మి, అరుణ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.



### భారీ వర్షాల హెచ్చరిక

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**వాస్తవం : భూపాలపల్లి**

జిల్లాలో రానున్న రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలనిజిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు.వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు అత్యవసర అవసరాలు ఉంటేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని, బయటకు వచ్చినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని,ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు,వంకలు,చెరువులు,కల్వర్టుల వద్దకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లవద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 9030632608 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించి ప్రభుత్వ సహాయాన్ని పొందవచ్చన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రజలకు అవసరమైన అత్యవసర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల భద్రతే అత్యంత ముఖ్యమని, అందరూ జాగ్రత్తలు పాటిస్తూ అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ విజ్ఞప్తి చేశారు.

### ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో

# సినారె జయంతి



**వాస్తవం : వేములవాడ**

తెలంగాణ సాహితీ శిఖరం,జ్ఞానపీఠ పురస్కార గ్రహీత,మహాకవి డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి 95వ,జయంతి సందర్భంగా వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సినారె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ."బహుముఖ ప్రజ్ఞాశాలి సినారె రాజన్న సిరిసిల్ల జిల్లాలోని హనుమాజీపేట గ్రామంలో 1931 జూలై 29న జన్మించాడని, విశ్వంభర, కర్పూర వసంతరాయలు, జలపాతం, అజంతా సుందరి వంటి ప్రముఖ రచనలు చేశారని, 1988లో 'విశ్వంభర' కావ్యానికి జ్ఞానపీఠ అవార్డు, పద్మశ్రీ, పద్మభూషణ్ వరించాయని, ఎన్నో మధురమైన సినీ గీతాలను రచించి తెలుగు చలనచిత్ర పరిశ్రమలో చెరగని ముద్ర వేశారని, రాజ్యసభ సభ్యుడిగా, తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ గా సేవలు అందించారని, మూడున్నర వేలకు పైగా అద్భుతమైన సినిమా పాటలు రాశారని,'అమ్మను మించి దైవమున్నదా' వంటి ఎప్పటికీ నిలిచిపోయే పాటలను అందించారని, 1993 నుంచి ఆంధ్ర సరస్వత పరిషత్ అధ్యక్షునిగా విలక్షణ కార్యక్రమాలు రూపొందించి తెలుగు భాష సాహిత్య, సాంస్కృతిక అభ్యుదయానికి తోడ్పడ్డారని, తన అపూర్వమైన కవిత్వంతో, సాహిత్య సృజనతో తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు డాక్టర్ సి.నారాయణ రెడ్డి అని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్ వాడీ ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారద, విద్యార్థులు పాల్గొన్నారు.




# రామ్కీ గో బ్యాక్ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

**చెత్త సేకరణ కార్మికుల హక్కులను కాపాడాలి**

**గుత్తేదారుల పెత్తనం సహించం**

**ప్రైమరీ కలెక్షన్ కార్మికులకే కొనసాగించాలని డిమాండ్**






**వాస్తవం : కుత్బుల్లాపూర్ ఆర్సీ**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఐడిపిఎల్‌లోని ఎల్ఎస్ ఫంక్షన్ హాల్‌లో కుత్బుల్లాపూర్ జోన్ స్వచ్ఛ ఆటో టిప్పర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "రామ్కీ గో బ్యాక్" కార్యక్రమానికి ఎమ్మెల్సీ,ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు ప్రొఫెసర్ కోదండరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చెత్త సేకరణ కార్మికుల సమస్యలు, వారి ఉపాధి భద్రత, గుత్తేదారుల జోక్యంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రొఫెసర్ కోదండరాం చెత్త సేకరణ చేసే కార్మికుల పనిని ఎట్టి పరిస్థితుల్లోనూ డిస్టర్బ్ చేయరాదని స్పష్టం చేశారు. పని చేసేది కార్మికులే అయినప్పుడు, వారి శ్రమ ఫలితాలు కూడా వారికే దక్కాలని పేర్కొన్నారు. కార్మికులపై ఎవరూ పెత్తనం చెలాయించకూడదని,వారి జీవనోపాధి దెబ్బ తినకుండా ప్రభుత్వం అండగా నిలవాల్సిన బాధ్యత ఉందన్నారు.గుత్తేదారుల పెత్తనాన్ని సహించేది లేదని హెచ్చరించిన ఆయన, సియంసీ పరిధిలోని ప్రైమరీ చెత్త సేకరణ వ్యవస్థను కార్మికులకే అప్పగించాలని డిమాండ్ చేశారు. చెత్త సేకరణ రంగంలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికుల కుటుంబాల జీవనాధారం దెబ్బతినకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా స్వచ్ఛ ఆటో టిప్పర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కలమడుగు రాజేందర్ మాట్లాడుతూ, కార్మికుల పొట్టకొట్టే ఏ ప్రయత్నాన్నైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామని తెలిపారు. కార్మికుల హక్కులను హరించే చర్యలను అడ్డుకుంటామని,వారి ఉపాధికి భంగం కలిగించే వారిని సహించబోమని హెచ్చరించారు. కార్మికుల జోలికి వస్తే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో ఆకుల శ్రీనివాస్,స్టీఫెన్,లక్ష్మారెడ్డి,కృష్ణ,వెంకన్న,నరసింహ, రంగన్న,మల్లేష్,అంజి,జగదీష్,ఉత్తరయ్య,ప్రశాంత్,దస్తగిరి, రవి,రామకృష్ణ,అల్వాల్ శ్రీను,కుత్బుల్లాపూర్ జోన్‌కు చెందిన స్వచ్ఛ ఆటో టిప్పర్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్మికుల ఐక్యతను చాటుతూ నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతమైందని యూనియన్ నాయకులు తెలిపారు. చెత్త సేకరణ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం భవిష్యత్తులో కూడా పోరాటాలు కొనసాగిస్తామని వారు వెల్లడించారు.

# ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

**షిరిడి సాయిబాబా ఆలయంలో అఖండ భజన**



**వాస్తవం : చందుర్తి**

చందుర్తి మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ మర్రి మల్లేశం ఆధ్వర్యంలో బుధవారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అఖండ భజన కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులతో పూజ కార్యక్రమాలు ధూప దీప నైవేద్యములు సమర్పించారు .దీనికి సహకరించిన భజన మండలి సభ్యులకు, రాజకీయ నాయకులకు, పుర ప్రముఖులకు గ్రామ ప్రజలకు, పరిసర గ్రామ ప్రజలకు ఆలయానికి విచ్చేసిన ప్రతి భక్తునికి ఆలయ కమిటీ చైర్మన్ మర్రి మల్లేశం హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమం అనంతరం రాత్రి రథంతో శోభ యాత్ర నిర్వహిస్తామని తెలిపారు.

## భూభారతి భూసర్వే (రీసర్వే)పై

# అవగాహనా సదస్సు



**వాస్తవం : తంగళ్ళపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా,తంగళ్లపల్లి మండలం రామచంద్రపూర్, నేడు రామచంద్రపూర్ గ్రామంలో భూభారతి భూసర్వే(రీసర్వే) పై రైతులకు అవగాహన కల్పించేందుకు అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా అధికారులు భూభారతి భూసర్వే ప్రక్రియ, భూముల కొలతలు, రికార్డుల పరిశీలన, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై రైతులకు వివరించారు. రైతుల సందేహాలను అధికారులు నివృత్తి చేసి,భూసర్వే ప్రక్రియకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డి ఐ వెంకటాచారి, తహసిల్దార్ మురళీకృష్ణ, ఏడిపి శ్రీనివాస్, ఆర్ ఐ సాయికృష్ణ, సర్వేయర్ జి చంద్రమోహన్, జిపిఓ స్వప్న, ఎల్ ఎస్ ఎస్ జగన్, సంతోష్ పాల్గొన్నారు.అలాగే గ్రామ సర్పంచ్ గంధం శ్రీనివాస్,ఉప సర్పంచ్ పొన్నాల నర్సింహులు,వార్డు సభ్యులు గడ్డం లహరి,గంధం రమేష్,పత్యం శేఖర్,పొన్నాల అమృత గ్రామ పంచాయతీ సెక్రటరీ ఈసారి లక్ష్మి,కాంగ్రెస్ నాయకులు దాకూరి మాధవరెడ్డి,నాయకుల బొడ్డు శ్రీధర్,మధు,రాజు తదితరులు పాల్గొన్నారు.ఈ అవగాహనా సదస్సుకు రైతులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతంచేశారు.

## సార్వత్రిక టీకాల కార్యక్రమాన్ని

# సమర్థవంతంగా అమలు చేయాలి

**వాస్తవం : తంగళ్ళపల్లి**




రాజన్న సిరిసిల్ల జిల్లా, తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిన్న బోనాల సబ్ సెంటర్‌లో బుధవారం నిర్వహిస్తున్న సార్వత్రిక టీకాల కార్యక్రమం (యు ఐ పి)ను జిల్లా వైద్య ఒ ఆరోగ్య అధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా టీకా సెషన్ నిర్వహణ, వ్యాక్సిన్ నిల్వ, కోల్డ్ చైన్ నిర్వహణ, లబ్ధిదారుల నమోదు, టీకాల వినియోగం, మదర్ ఒ చైల్డ్ ప్రొటెక్షన్ కార్డుల నమోదు తదితర అంశాలను పరిశీలించారు. అర్హులైన ప్రతి గర్భిణి, శిశువు, చిన్నారికి జాతీయ టీకా షెడ్యూల్ ప్రకారం అన్ని టీకాలు తప్పనిసరిగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు.గ్రామస్థాయిలో టీకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, టీకాలకు గైర్హాజరైన లబ్ధిదారులను గుర్తించి వారికి వెంటనే టీకాలు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.టీకా సెషన్లలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డి ఐ ఓ) డా.సంపత్‌కుమార్,వి సి సి ఎం నవీన, ఏఎన్ఎంలు, సంబంధిత ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# సమాజసేవ నాయకత్వం లయన్స్‌క్లబ్‌తోనే సాధ్యం

**గ్రామ స్థాయిలో క్లబ్ సేవలను విస్తరింపజేయాలి**

**రాష్ట్రంలో 2 లక్షల మందికి ఉచితంగా భోజనం అందిస్తున్నాం**

**ఫాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు**

**వాస్తవం : ఆందోల్**



ప్రపంచ స్థాయిలో గుర్తింపు కలిగిన లయన్స్ క్లబ్ సేవలను గ్రామస్థాయిల్లోనూ మరింతగా విస్తరింపజేయాలని ఫాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు సూచించారు. మంగళవారం రాత్రి సంగుపేట వద్దనున్న లక్ష్మీదేవీ గార్డెన్స్‌లో జోగిపేట లయన్స్ క్లబ్ 51వ ఇన్‌స్టాలేషన్ నైట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ప్రసంగించారు. సమాజ సేవ, నాయకత్వం,సంక్షేమ కార్యక్రమాలకు మారుపేరుగా లయన్స్ క్లబ్ నిలిచిందన్నారు. మిషన్ 1.5 కార్యక్రమంలో భాగంగా ఎక్కువ శాతం మెంబర్ షిప్ చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ద్వారా తెలంగాణ వ్యాప్తంగా 24 వాహనాలలో సుమారుగా 2 లక్షల మందికి పలు అసుపత్రుల వద్ద రోగులకు ఉచితంగా బోజనాన్ని అందిస్తున్నామన్నారు. ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను చేసేందుకు సభ్యులు దాని బలోపేతానికి సహకారాన్ని అందజేయాలన్నారు. మాజీ గవర్నర్ డాక్టర్ ఎస్.రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో వేలాది కంటి శిభిరాలను నిర్వహించి,ఉచితంగా ఎంతో మంది కంటి చూపును ఇచ్చారని ఆయన కొనియాడారు. అనంతరం మాజీ గవర్నర్ డాక్టర్ ఎస్. రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ జోగిపేట లయన్స్ క్లబ్ తరపున గత కొన్నేండ్లుగా డాక్టర్ అనంత్‌రెడ్డి అందిస్తున్న సేవలపై ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. జోగిపేట క్లబ్ తరపున ఈ సారి డిస్ట్రిక్ మూడవ గవర్నర్‌గా అనంత్‌రెడ్డి పేరును తీర్మాణం చేయడం జరిగిందని తెలుపడంతో క్లబ్ సభ్యులు చప్పట్లతో తీర్మాణాన్ని ఆమోదించారు. ఈ నియమాకానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.సభ్యుల ప్రమాణ స్వీకారం:లయన్స్ క్లబ్ ఇన్‌స్టాలేషన్ నైట్ కార్యక్రమంలో భాగంగా 2026--27 సంవత్సరానికి గాను జోగిపేట, నర్సాపూర్, మెదక్ మంజీరా, గడ్డపోతారం, మెదక్ సిటిజన్, జిన్నారం ఆదర్శ,చిన్నశంకరంపేట క్లబ్‌ల నూతన పాలకవర్గ సభ్యులను మాజీ గవర్నర్ డాక్టర్ ఎస్. రవీందర్‌గౌడ్, మల్టికౌన్సిల్ చైర్మెన్ ఏ.అమర్‌నాథ్ రావులు ప్రమాణ స్వీకారం చేయించారు. జోగిపేట క్లబ్ అధ్యక్షుడు జీఆర్.మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి ఎం.మల్లేష్, కొశాది .కారి జీ.సంతోష్‌లతో పలువురు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ డిస్ట్రిక్ గవర్నర్‌లు జనార్ధన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, టీవీపీ. చారీ, గంప రమేష్, గవర్నర్--1 నర్సింహ రాజు, గవర్నర్--2 పద్మావతి, డిస్ట్రిక్ ట్రేజరర్ జీఆర్.సుజాత, మార్కెట్ చైర్మెన్ జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి, రీజియన్ చైర్మన్ రాజ్‌కుమార్, ప్రోగ్రామ్ ఆర్గనైజర్లు ఎ.రాంబాబు, పద్మనాభరెడ్డి, మాస్టర్ ఆఫ్ సెర్మనీ జగన్మోహన్‌రెడ్డిలతో పాటు పాల్గొన్నారు.

# యువత భవిష్యత్తులో నైపుణ్యాలకన్నా..సృజనాత్మకతే ఓ సవాల్



మల్లాడి శ్రీనగేష్
విద్యా విషయ విశ్లేషకులు

రాబర్ట్ గ్రీనే చెప్పినట్టు “యువత భవిష్యత్తు ఎక్కువ నైపుణ్యాలను గడించడమే కాదు వాటిని సృజనాత్మకంగా వినియోగించుకున్న వారికే సాధ్యమౌతుందనేది” వాస్తవం. భారతదేశంలో యువత జనాభా 2025 నాటికి ప్రపంచంలోనే అత్యధికంగా ఉంది. దేశ జనాభాలో దాదాపు 65% మంది 35 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారే కావడం గమనార్హం. ఇందులో 15-29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకులు సుమారు 37.1 కోట్లు (371 మిలియన్లు) ఉన్నారు. విద్యావంతులైన యువతకు వారి నైపుణ్యాలకు తగ్గ సరైన ఉపాధి అవకాశాలు లభించకపోవడం 2025లోనూ ఒక పెద్ద సవాలుగా మారిందియనేది వాస్తవం. మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా డిజిటల్ మరియు వృత్తిపరమైన నైపుణ్యాలను, సృజనాత్మకతను, కొంగ్రొత్త రంగాలలో చొచ్చుకుపోవడానికి మరింత చురుకుదనం, పోటీ తత్వాన్ని ఎదుర్కొనే వ్యక్తిగత సామర్థ్యాలు మెరుగుపరచుకోవడం యువత ప్రధాన కర్తవ్యం. నిజానికి యువత భవిష్యత్తు వారి భుజస్కంధాలపైనే ఆధారపడి ఉంది. వారు కనబరిచే చొరవ, పరిస్థితులకు అనుకూలంగా ఇమిడిపోవడం, నైపుణ్యాలను రోజు రోజుకూ మెరుగుపరచుకోవడం యువత అభివృద్ధికి ప్రధాన భూమికలుగా గుర్తించక తప్పదు.

**ముందున్న సవాళ్లు**

చదువుకున్న చదువుకు గడించిన నైపుణ్యాలకు ఉద్యోగ మార్కెట్లో ఉన్న మారుతున్న సాంకేతిక పరిణామాలకు ఎక్కడా పొంతన లేదు . అంటే చదువుకు- పరిశ్రమకు -చదువుకు ఉద్యోగాల అర్హత ,అనుభవాలకు పొత్తు లేదు. అందుకే భవిష్యత్తు అంతా పెరుగుతున్న సాంకేతిక, కృత్రిమ మేధ, సైబర్ సురక్షిత విధానాలు , పోటీని ఎదుర్కొనే మానసిక స్థైర్యం, సృజనాత్మకత, విశ్లేషాత్మక మరియు ప్రయోగాత్మక ప్రపంచంలో యువత తనకు తాను పుంజుకుంటూ ఈదుకుంటూ దరి చేరాలి తప్ప విశ్రమించడం ప్రగతికి నిజమైన అవరోధం. మారిన పరిస్థితులకు అనుగుణంగా తమ నైపుణ్యాలను మెరుగుపరచుకునే సంసిద్ధత ప్రస్తుత పరిస్థితుల్లో యువతకు కావలసిన ప్రత్యేక లక్షణాలు. దీనికి కళాశాలలు తదనుగుణమైన కరికులం ఏర్పాటులో ఎంత మాత్రం జాగరూకత వహించకపోవడం యువతకు నిరాశాజనకం.ఇంకా మూస విధానంలో కరికులం , పాఠ్యంశాలు , ప్రయోగశాలలు, వృత్తి నైపుణ్యతకు నోచకోని ఉపాధ్యాయుల స్థితిగతులు, ప్రపంచ డిమాండ్లకు సరిపడు కోర్సుల ఏర్పాటులో ఏమరుపాటుతనం, మార్కులే పరమావధిగా నైపుణ్యం, సృజనాత్మకత, నూతనత్వం జోడించని సాంప్రదాయ విద్యా విధానాల ధోరణి యోచిస్తే మనం ప్రగతికి ఆమడదూరంలో ఉన్నట్టు అవగతమౌతోంది. ఎకనామిక్ సర్వే 2024-25 ప్రకారం 8.25 శాతం మంది గ్రాడ్యుయేషన్ పొందిన యువత మాత్రమే వారు గడించిన విద్యార్హతకు అనుగుణంగా ఉద్యోగం పొందగలుగుతున్నారు. సుమారు 50 శాతం మంది యువత వారి నైపుణ్యాలకు పొంతన లేని పాక్షిక నైపుణ్యం గల రంగాలలో ఉపాధి పొందుతున్నారు

**అందోళన కలిగిస్తున్న అధ్యయనాలు :**

27 శాతం ఇంజనీరింగ్ విద్యార్థులు మాత్రమే వారు చదువుకున్న రంగంలో ఉద్యోగాలు సాధిస్తున్నారు యని సి.ఐ .ఐ తన నివేదికలో వెల్లడించింది. అంతేకాక ప్రస్తుతం ఉద్యోగాల్లో చేరుతున్న యువతలో 60 శాతం మంది కూడా వారి ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో అవసరమైన కమ్యూనికేషన్, టీం వర్క్ మరియు సమస్యల అవగాహన వాటి పరిష్కారాల నైపుణ్యాలలో వెనుకబడి ఉన్నారని సంస్థల యాజమాన్యాలు తెలియపరచినట్టు నివేదిక వెల్లడించింది. ఇండియా గ్రాడ్యుయేట్ స్కిల్ ఇండెక్స్ 2025 ప్రకారం 42.6 శాతం భారత గ్రాడ్యుయేట్లు మాత్రమే ప్రస్తుత పరిశ్రమ రంగానికి కావలసిన నైపుణ్యాలను కలిగి వున్నారని మరియు అత్యధిక శాతం ఉద్యోగాలను సాధించడానికి కృత్రిమ మేధ , మెషిన్ లెర్నింగ్ వంటి రంగాలలో ప్రవేశించడానికి ఇక తగిన సమాయత్తం కొరవడిందని , సాంకేతిక పరిజ్ఞానం ఉన్నప్పటికీ వాటి వినియోగం తదనుగుణమైన విశ్లేషణ మరియు కమ్యూనికేషన్ విషయాల్లో అతి శ్రద్ధ అవసరమని తెల్పింది. అంతే కాక ప్రప్రథమంగా పురాతన పాఠ్యంశాలు , కరికులంలో ఎంతమాత్రం మార్పు లేకపోవడం, పరీక్షలు మరియు డిగ్రీలు సాధించడంలోనే తీవ్ర ఒత్తిడి అనగా అంశాలను బోధించడమే కానీ వాటి మూలలను విశ్లేషించి విశదీకరించక పోవడమనేది ప్రధానాంశం. అంతేకాక 80 శాతం ఉపాధ్యాయులు ప్రస్తుత పరిశ్రమలకు కావాల్సిన వృతి నైపుణ్యాల గురించి పూర్తి అవగాహన కూడా లోపించడం వలన విద్యార్థులు ఉద్యోగ పోటీలో వెనుకబడుతున్నారని అల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సర్వే సూచించింది , ఈ విషయాలను విద్యా సంస్థలు గ్రహించి తదనుగుణమైన నైపుణ్యాలను అందించాలని, ఉపాధ్యాయులను సన్నద్ధం చెయ్యాలని, విద్యార్థుల యొక్క ఆసక్తి మరియు వారి ప్రతిభకు అనుగుణంగా తరగతి గదిని తీర్చి దిద్దాలని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ఉదాహరణకు ఇండియా టుడే వారి నివేదిక ప్రకారం 93 శాతం 14-21 వయసు కల్గిన మంది విద్యార్థులు అందుబాటులో వున్న సుమారు 250 కెరీర్ -ఉద్యోగ అవకాశాల ఆప్షన్లలో వారికి కేవలం 7 రకాల ఉద్యోగ రంగ సమాచారం మాత్రమే కలిగి ఉన్నట్టు, సుమారు 90 శాతం మంది విద్యార్థులు తప్పు కెరీర్ ఎంపికను చేసుకుంటున్నట్లు వెల్లడైంది. ఈ ఎంపిక పట్ల వారికి అవగాహన లేకపోవడం వారి నైపుణ్యాలకు ఉద్యోగ అర్హతకు ఎంతమాత్రం పొంతన లేకపోవడం, దీని వల్ల ఎక్కువ శాతం మంది సరైన ఉద్యోగాలను పొందలేక, పొందినా సంతృప్తి చెందక, ఉద్యోగ బాధ్యతను నిర్వహించలేక నిరాశలో వున్నారని తెలుస్తోంది. అంతేకాక, అవగాహనా రాహిత్యం వల్ల ఇంజనీరింగ్,



కంప్యూటర్ మరియు వివిధ టెక్నికల్ కోర్సులలో బాలికల చేరిక శాతం చాలా తక్కువని తెలుస్తోంది. నిజానికి 30-40 శాతం మంది బాలికలు మాత్రమే టెక్నికల్ కోర్సులలో చేరుతున్నారని అల్ ఇండియా స్టడీ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ 2021 నివేదిక వెల్లడించింది.

**తక్షణ కర్తవ్యం**

21వ శతాబ్దపు నైపుణ్యాల ఒరవడిలో పాతకాలపు మరియు పాతుకుపోయిన విధానాలకు స్వస్తి పలికి అకడమిక్ మరియు వృత్తి నైపుణ్యాలను జోడించి విద్యార్థులకు అనుభవాత్మక విద్యను అందించడం తప్పనిసరిగా గుర్తించాలి. వృత్తి విద్యా నైపుణ్యాలకు పెద్ద పీట వేయడం తద్వారా మహిళల ఉద్యోగ ప్రవేశాలను 10-15 శాతం, గ్రామీణ యువత ఉద్యోగ అవకాశాలను 25 శాతం పెంచడం. యన్న జాతీయ విద్యా విధాన ధ్యేయాన్ని అధిగమించడమంటే దేశానికి మానవ వనరుల సంరక్షణలో ముందుటామని చెప్పవచ్చు ఈ నేపథ్యంలో కరికులం , ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలు, మార్కెట్ ప్రభావిత అదనపు కోర్సులను పాఠ్యంశాలుగా చేర్చడం తప్పనిసరి యని భావించినప్పటికీ వాస్తవంలో ఆచరణకు మరింత సమయం పడుతుందియనేది నిస్సందేహం . ఈ లోపు లక్షలాది మంది విద్యార్థులు తమ గ్రాడ్యుయేషన్ చదువు ముగించుకొని ఉద్యోగాలకు సిద్ధపడితే సక్సెస్ శాతం అంతంతమాత్రమే యని చెప్పక తప్పదు. ఈ లక్ష్యాలు నెరవేరాలంటే దేశంలో నాణ్యమైన విద్యను మరింత బలోపేతం చేయడం తప్పనిసరి .దీనికి కొన్ని ముఖ్యమైన సంస్కరణలు అనివార్యం. పాఠశాల కరికులం . ఉపాధ్యాయ వృత్తి విద్యా నైపుణ్యాల సరళి తరగతుల నిర్వహణ లో శాస్త్రీయ దృక్పథం, ఏదైనా విషయం గురించి తార్కికంగా, హేతుబద్ధంగా, సృజనాత్మకతతో యోచించడం వంటి ప్రాధాన్యతా అంశాలపై ద్రుష్టి -యువతకు ఉద్యోగ -ఉపాధి రంగాలలో భరోసా యువతకు భరోసా తప్పనిసరి యని గుర్తించక తప్పదు. కృత్రిమ మేధస్సు దిశగా దేశం పరుగులు పెడుతున్న తరుణంలో మన విద్యా నైపుణ్యాలను త్వరిత గతిన మెరుగుపరచ దానికి మౌలిక వసతులు , యువతకు నూతన నైపుణ్యాలవైపు అవగాహన , క్షేత్ర సందర్శన, కళాశాల విద్యను కొత్త కోర్సులతో మెరుగుపరచడం, ఉన్నత విద్యా స్థాయి మొదలుకొని ఉపాధి -ఉద్యోగ మార్కెట్ల యొక్క డిమాండ్ సంబంధిత సమాచారాన్ని అందుబాటులో ఉంచడం, కెరీర్ కౌన్సిలింగ్ సౌకర్యాలతో యువతను సమాయత్త పరచడం ప్రధాన బాధ్యతగా ప్రభుత్వాలు, విద్యాలయాలు గుర్తెరగాలి. లేకపోతే చదువుకు -ఉద్యోగ ఉపాధి రంగాలకు అవసరమైన పనితనానికి ఎంతమాత్రం పొంతన ఉండక మనవాభివృద్ధికే పెద్ద విఘాతం. ఈ పరిస్థితిలో చదువు మరియు నైపుణ్యాలు ప్రాథమిక స్థాయి నుండి బహుళ ప్రయోజనాల ప్రాతిపదికన ఉండాలి. డిమాండ్ కలిగిన వృత్తిపరమైన విద్యా కోర్సుల రూపకల్పన, విద్యార్థులకు ఉత్సుకత సంతరింపచేసే నైపుణ్యాలతో కూడిన అనుభవాత్మక విద్య, మంచి సంభాషణా చాతుర్యం, సహకారం ప్రతిపాదికతో జట్టు కార్యక్రమాలు వంటి అంశాలను జోడించి వినూత్న విద్యా వ్యవస్థను -ప్రోత్సహించాలి. నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల -అధ్యాపకుల ఎంపికలో , మౌలిక వసతుల కల్పనలో, నిధుల కేటాయింపులో ప్రాధాన్యత లేకపోతే పోటీ ప్రపంచంలో యువత నెగ్గుకు రావడం కష్టతరమే. సాంప్రదాయ రీతి బోధనకు స్వస్తి పలికి కృత్యాధార, డిజిటల్ బోధన. పీర్ లెర్నింగ్, లైబ్రరీ వినియోగం, స్టెమ్ ఆధారిత అనుభవాత్మక విద్యను అందుబాటులో ఉంచడం తప్పనిసరి. ఈ ఫలితాలు సాధించడానికి కళాశాలలకు వృత్తి నైపుణ్యాల పెంపుదలలో ప్రభుత్వాలు తగినన్ని నిధులను వెచ్చించి వారికి వినూత్న బోధన విధానాలపై ప్రత్యేక శిక్షణలు, సేవ్ ది చిల్డ్రన్ (బాల్ రక్షా భారత్) వివిధ రాష్ట్రాల్లో ప్రయోగ ఫలితాల ఆధారంగా ఏర్పరచిన ఉత్సహవంతులైన సబ్జెక్టు ఆధారిత పెడోగోజికల్ ఫోరమ్ లను ఏర్పరచి వారికి తగిన శిక్షణ , అదనపు కోర్సులను నేర్చుకొనే వెసులుబాటు కల్పించడం, క్షేత్ర స్థాయి అవగాహన ద్వారా తద్వారా ఉపాధ్యాయులకు వృత్తి పరమైన నైపుణ్యాలను అందించి అధ్యాపక లేదా ఉపాధ్యాయ సిబ్బందిని సంసిద్ధపరచడం తప్పనిసరి యని ప్రభుత్వాలు గుర్తించాలి. అందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రణాళికలు రచించి యువత భవితకు భరోసా కల్పించాలి.

**(ఈ వ్యాసంలోని అంశాలు వ్యక్తిగత మరియు అధ్యయన అంశాలు. నేను పని చేస్తున్న సంస్థకు సంబంధించినవి కావు.)**

**రాబర్ట్ గ్రీనే చెప్పినట్టు “యువత భవి ష్యత్తు ఎక్కువ నైపుణ్యాలను గడించడమే కాదు వాటిని సృజనాత్మకంగా వినియో గించుకున్న వారికే సాధ్యమౌతుందనేది” వాస్తవం. భారతదేశంలో యువత జనాభా 2025 నాటికి ప్రపంచంలోనే అత్యధికంగా ఉంది. దేశ జనాభాలో దాదాపు 65% మంది 35 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారే కావడం గమనార్హం. ఇందులో 15-29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకులు సుమారు 37.1 కోట్లు (371 మిలియన్లు) ఉన్నారు. విద్యా వంతులైన యువతకు వారి నైపుణ్యాలకు తగ్గ సరైన ఉపాధి అవకాశాలు లభించ కపోవడం 2025లోనూ ఒక పెద్ద సవా లుగా మారిందియనేది వాస్తవం. మారు తున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా డిజిటల్ మరియు వృత్తిపరమైన నైపు ణ్యాలను, సృజనాత్మకతను, కొంగ్రొత్త రంగాలలో చొచ్చుకుపోవడానికి మరింత చురుకుదనం, పోటీ తత్వాన్ని ఎదుర్కొనే వ్యక్తిగత సామర్థ్యాలు మెరుగు పరచుకో వడం యువత ప్రధాన కర్తవ్యం.**

## కొండా మురళికి ఏ హోదా ఉందని

# 2 ప్లస్ 2 సెక్యూరిటీ ఇచ్చారు?

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**హైదరాబాద్:** సెక్యూరిటి రివ్యూ అని సమావేశం పెట్టి పెద్ది సుదర్శన్ రెడ్డి గన్‌మెన్లను తొలగించారు. ఆయనకు థ్రెట్ ఉన్నది అని 25 సంవత్సరాల నుండే సెక్యూరిటీ ఉన్నది దీనిపై కోర్టుకు వెళ్లారు. కోర్టులో స్టే ఇచ్చారు. దీనితో వరంగల్ జిల్లా సీపీ వద్దకు వెళ్తే నాకు సంబంధం లేదు స్టేట్ ఇంటలిజెన్స్ వాళ్లు చూస్తారని చెప్పారు. పెద్ది సుదర్శన్ రెడ్డి తీవ్ర ఒత్తిడికి లోనయ్యారని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు.తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. డీజీపీ నాకు కూడా ఒక్క నోటీస్ ఇచ్చారు. నీకు బుల్లెట్ ప్రూఫ్ వాహనం తొలగిస్తున్నాం. సెక్యూరిటీ తగ్గిస్తున్నాం అని లేఖ రాశారు. ఏమైనా థ్రెట్ ఉంటే మాత్రానే సెక్యూరిటీ ఇస్తామని చెప్పారు. సరే బాగానే ఉన్నది మరి మైనంపల్లి హన్మంతరావు ఏం కూంబింగ్ ఆపరేషన్లు చేశాడని, ఏ తీవ్రవాద సంస్థ, ఏ మావోయిస్టులు ఆయనను టార్గెట్ చేశారని 2 ప్లస్ 2 సెక్యూరిటీ ఇచ్చారు..? అని ప్రశ్నించారు.కొండా మురళీ ఎమ్మెల్సీ కాదు, కార్పొరేషన్ చైర్మన్ కాదు. ఆయనకు 2 ప్లస్ 2 సెక్యూరిటీ ఇచ్చారు.. ఆయనకు ఏ హోదా ఉందని 2 ప్లస్ 2 సెక్యూరిటీ ఇచ్చారు..? అనుముల తిరుపతి రెడ్డి, అనుముల కొండల్ రెడ్డి ఏం కూంబింగ్ ఆపరేషన్లు చేశారని, ఏ ఉగ్రవాద సంస్థతో ముప్పు ఉందని, విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న అత్యాధునిక సెమీ ఆటోమేటెడ్ వెపన్స్ ఇచ్చారు..? సునీతా మహేందర్ రెడ్డి మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ వారికి కూడా గన్‌మెన్లను ఇచ్చారని అడిగారు. అనుముల తిరుపతి రెడ్డికి ఉన్న అర్హత ఏంటి..? పెద్ది సుదర్శన్ రెడ్డి లేని అర్హత ఏంటీ.. చెప్పాలన్నారు.సత్యవతి రాథోడ్ తెలంగాణ రాష్ట్రంలో తొలి గిరిజన మహిళా మంత్రి.. ఆమె ఇప్పుడు మాజీ మంత్రి, మాలోతు కవిత మాజీ ఎంపీ.. వారి గన్‌మెన్లను తీసేశారు. జోగు రామన్న మాజీ మంత్రి ఆయన గన్‌మెన్లను తొలగించారు.. అదే జిల్లాలో ఇంద్రకరణ్ రెడ్డికి 2 ప్లస్2 గన్‌మెన్లను ఇచ్చారు ఎందుకు..? అని అడిగారు. కుందూరు జానారెడ్డి ప్రస్తుత హోదా ఏంటి..? ఆయనకు 2ప్లస్2 గన్‌మెన్లను ఇచ్చి, అత్యాధునిక బుల్లెట్‌ప్రూఫ్ వాహనం ఇచ్చారు. జానారెడ్డి మాజీ మంత్రి అయితే సత్యవతి రాథోడ్, జోగు రామన్న కూడా మాజీ మంత్రులే కదా. మరి వీళ్లకు ఎందుకు సెక్యూరిటీ తొలగించారు..? బీఆర్ఎస్ నాయకులకు ఒక న్యాయం.. కాంగ్రెస్ నాయకులకు ఒక న్యాయమా..? ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అని ప్రశ్నించారు.జగ్గారెడ్డికి ఏం చేశాడని గన్‌మెన్‌లను ఇచ్చారు..? అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కు గన్‌మెన్లు ఇచ్చారు.. ఆయనకు ఏం ముప్పు ఉన్నది.కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ 3 సార్లు ఎమ్మెల్యే ఆయనకు భద్రత తొలగించారు. తల్లోజు ఆచారి ఎమ్మెల్యే కూడా ఆయనకు ఎందుకు ఇచ్చారు.. ఈశ్వరమ్మ యాదవ్ యాదాద్రి బోర్డు సభ్యులు సీనియర్ రాజకీయ నాయకురాలు పదవి స్వీకారం చేశారు. ఆమె పై శ్రీ చరణ్ రెడ్డి ఆమె అనేక మాటలు మాట్లాడారు. ఆయనకు గన్‌మెన్లను ఇచ్చారు.జగ్గారెడ్డికి ఎందుకు గన్ మెన్ లను ఇచ్చారు. ఏం చేశాడని గన్ మెన్ లను ఇచ్చారు. తూముకుంట నర్సారెడ్డికి ఎందుకు గన్ మెన్లను ఇచ్చారు.. ఎర్రబెల్లి ప్రదీప్ రావుకు



ఎందుకు ఇచ్చారు, అదే వినయ్ భాస్కర్‌కు ఎందుకు ఇవ్వలేదు, నన్నపనేని నరేందర్‌కు లేదు. సెక్యూరిటీ రివ్యూ కమిటి అనేది లోపభూయిష్టమైన కమిటి. మిస్టర్ రేవంత్ రెడ్డి మీరు మాజీ ముఖ్యమంత్రి అయితే కూడా మీకు భద్రత తగ్గించరు.ఈ సెక్యూరిటీ రివ్యూ కమిటీని తొలగించండి.సెక్యూరిటీ రివ్యూ కమిటి రిపోర్ట్ బయట పెట్టాలి ఫహిం ఖురేషి ,వాసవి బిల్డర్ కుట్ర బహిర్గతం కావాలి, దీనిపై పార్టీ సీరియస్‌గా తీసుకుంటుందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ తొలగించాలని హైకోర్ట్ ఆదేశాలు ఇస్తే డివిజన్ బెంచ్‌కు పోతాం అని చెప్పారో మేము కూడా అదే చెప్తున్నాం. బుల్లెట్ ప్రూఫ్ కార్లు అంటున్నావ్. కర్ణాటకలో, తమిళనాడులో మంత్రులకు బుల్లెట్ ప్రూఫ్ కార్లు లేవు. నక్సల్స్ ప్రభావం లేని రాష్ట్రం తెలంగాణ అంటున్నారు కదా.. మరి బుల్లెట్ ప్రూఫ్ కార్లు ఎందుకు మంత్రులకు..? దీనిపై కోర్టుకు వెళ్తాం....న్యాయ పోరాటం చేస్తాం. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని కోరుతున్నామని డిమాండ్ చేశారు.

## కేసీఆర్ పాలనా ముద్ర

# ప్రగతి రథచక్రాలా? అప్పుల నిలయమా?



డా. సూర్యదేవర రామకృష్ణ
9490754169

2014లో సాకారమైన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో తొలి పీఠాన్ని అధిరోహించిన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) నేతృత్వంలోని బీఆర్ఎస్ (గతంలో టీఆర్ఎస్) సర్కార్, దాదాపు తొమ్మిదిన్నర సంవత్సరాల పాటు (2014--2023) ప్రభంజనంలా పాలన సాగించింది. ఈ సుదీర్ఘ కాలంలో కేసీఆర్ ప్రభుత్వం నాటిన నమూనాలు, ఆవిష్కరించిన సాగునీటి, తాగునీటి, వ్యవసాయ, విద్యుత్ రంగాల భారీ ప్రాజెక్టులు జాతీయ స్థాయిలో పెను సంచలనమే సృష్టించాయి. ఊహించని రీతిలో సంక్షేమ పథకాలను విసిరిన బీఆర్ఎస్, తనదైన శైలిలో పాలనా ముద్ర వేసింది. అయితే, అదే స్థాయిలో మితి మీరిన ఖర్చులు, కొండలా పెరిగిన అప్పుల భారం, నాణ్యతా లోపాలు, అవినీతి ఆరోపణలు నాడు ప్రతిపక్షాల నుంచి, నేడు ప్రజల నుంచి తీవ్ర స్థాయిలో వెల్లువెత్తాయి. 2023 చివర్లో జరిగిన హోరాహోరీ అసెంబ్లీ సమరంలో అధికార పీఠాన్ని కోల్పోయిన బీఆర్ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పీఠాన్ని చేజిక్కించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచే గత ప్రభుత్వ నిర్ణయాలపై సమరశంఖం పూరించింది. శ్వేతపత్రాలు, విచారణ కమిషన్లు, జుడిషియల్ ఎంక్వైరీల పేరుతో గత పాలనలోని అక్రమాలను, అంకెల గారడీని కళ్లెదుట నిలబెట్టే ప్రయత్నం చేస్తోంది. ఈ క్రమంలో, రెండు పక్షాల వాదనలు, వాస్తవ గణాంకాలు, రాజకీయ వ్యూహాలపై విశేష కథనం.

**ప్రగతి పథంలో ప్రయోగాలు : బంగారు తెలంగాణ వైపు అడుగులు?**

కేసీఆర్ పాలనలో తెరపైకి వచ్చిన ప్రతిష్టాత్మక పథకాలు నభూతో నభవిష్యత్ అన్నట్లుగా ప్రచారంలో నిలిచాయి. అందులో ప్రముఖంగా చెప్పుకోదగ్గది మిషన్ భగీరథ. రాష్ట్రంలోని పల్లె పల్లెకు, గుడారాల దాకా ప్రతి ఇంటికీ నల్లా ద్వారా స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీటిని అందించాలన్న భగీరథ తపస్సుతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. కేంద్ర జల్ జీవన్ మిషన్ చేపట్టిన విస్తృత పరిశీలనలో, రాష్ట్ర వ్యాప్తంగా యాదృచ్ఛికంగా ఎంపిక చేసిన 320 గ్రామాల్లోని ప్రతి కుటుంబానికి రోజూ 100 లీటర్ల నాణ్యమైన తాగునీరు అందుతున్నట్లు నివేదికలు స్పష్టం చేశాయి. ఈ అసాధారణ పనితీరుకు గాను "రెగ్యులారిటీ కేటగిరీ"లో దేశంలోనే తెలంగాణ సరికొత్త చరిత్ర సృష్టిస్తూ మొదటి స్థానంలో నిలిచింది. కేంద్ర ప్రభుత్వం నుంచి జల్ జీవన్ మిషన్ విశిష్ట అవార్డును సైతం దక్కించుకుంది. అటు మిషన్ కాకతీయ పేరుతో నిజాం కాలం నాటి పురాతన చెరువులను, చిన్న నీటిపారుదల కుంటలను పూడికతీసి లక్షలాది రూపాయలు వెచ్చించి పునరుద్ధరించారు. వ్యవసాయ రంగాన్ని నిలబెట్టేందుకు రైతుబంధు (ఎకరానికి పెట్టుబడి సాయం), రైతుబీమా (రైతు అకాల మరణం చెందితే రూ. 5 లక్షల తక్షణ ఆర్థిక పరిహారం), ఉచిత 24 గంటల త్రీ-ఫేజ్ వ్యవసాయ విద్యుత్ సేవలు విప్లవాత్మక మార్పులు తెచ్చాయని బీఆర్ఎస్ వర్గాలు ఘీంకరించాయి. ఈ పథకాల విజయాన్ని చూసే కేంద్రం 'పీఎం-కిసాన్' వంటి పథకానికి శ్రీకారం చుట్టిందని నాటి బీఆర్ఎస్ పెద్దలు గర్వంగా చెప్పుకొచ్చారు. మరొక వైపు, బీఆర్ఎస్ పాలనకు మకుటాయమానంగా నిలిచింది కాళేశ్వరం ఎత్తిపోతల పథకం. గోదావరి జలాలను ఉప్పెనలా ఎత్తిపోసి, ఏకంగా 18.8 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు భాగ్యనగర తాగునీటి అవసరాలు, పారిశ్రామిక అవసరాలు తీర్చడమే లక్ష్యంగా దీనికి రూపకల్పన చేశారు. 2012లో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.38,000 కోట్లతో రూపకల్పన చేసిన ఈ ప్రాజెక్టును, 2019లో కేసీఆర్ జాతికి అంకితం చేసే సమయానికి దాని పరిధిని పెంచి రూ. 80,190 కోట్లకు సవరించారు. ఇది కాకతీయుల తర్వాత రైతాంగానికి దక్కిన చారిత్రక వరం అని బీఆర్ఎస్ అభివర్ణించింది. రికార్డు స్థాయి వరదలు వచ్చినప్పుడు కూడా మేడిగడ్డ బ్యారేజీ 12 లక్షల క్యూసెక్కుల నీటి ఉద్ధృతిని తట్టుకుని నిలబడిందని ఆ పార్టీ గులాబీ శ్రేణులు బలంగా వాదించాయి. ఈ సంక్షేమానికి తోడు దేశ జీడీపీలో తెలంగాణ పాత్రను బీఆర్ఎస్ నేతలు అంకెలతో సహా ఎత్తి చూపారు. దేశ జనాభాలో కేవలం 3 శాతాని కంటే తక్కువగా ఉన్న తెలంగాణ, జాతీయ జీడీపీలో మాత్రం సుమారు 5 శాతం వాటాను అందిస్తూ ఆర్థిక ఇంజన్ లా దూసుకుపోతోందని గుర్తు చేశారు. పరిశ్రమల ఏర్పాటుకు సులభతర అనుమతులిచ్చే 'టీఎస్-ఐపాస్' సంస్కరణలను ప్రపంచ బ్యాంకు సైతం ముక్తకంఠంతో ప్రశంసించిందని నాటి పారిశ్రామిక మంత్రి కేటీఆర్ పదేపదే ఉద్ఘాటించారు.

**విమర్శల తుఫాను : అప్పుల ఊబి, కాళేశ్వరం కుంగుబాటు!:**

అయితే, నాణేనికి రెండో వైపు చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అసలు కథ వేరే ఉందంటూ బాంబులు పేల్చడం ప్రారంభించింది. కాళేశ్వరం ప్రాజెక్టు రీ-డిజైనింగ్ పేరుతో నిధుల దుర్వినియోగం జరిగిందని, ప్రాజెక్టు అంచనా వ్యయం ఏకంగా రూ.1.2 లక్షల కోట్లకు చేరినా, ఆశించిన ఫలితాలు శూన్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సరిగ్గా ఎన్నికలకు ముందు, 2023 అక్టోబర్‌లో కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు ఒక్కసారిగా క్రస్ట్ లెవెల్లో కుంగిపోవడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనపై విచారణకు రంగంలోకి దిగిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్, నిర్మాణంలో పూడ్చలేని నిర్లక్ష్యం, డిజైన్ లోపాలు, తీవ్రమైన నాణ్యతా లోపాలు ఉన్నాయని తేల్చిచెప్పింది. పైగా నాటి కేసీఆర్ ప్రభుత్వంలో వాస్తవాలను ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టారని, ఈ దారుణానికి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆరే ప్రధాన బాధ్యుడని బాంబు పేల్చింది. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) కూడా ప్రణాళిక, నాణ్యతా ప్రమాణాల ఉల్లంఘనే మేడిగడ్డ విపత్తుకు కారణమని కుండబద్దలు కొట్టింది. దీనిపై సుదీర్ఘ అసెంబ్లీ చర్చల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దర్యాప్తును ఏకంగా సీబీఐ కి అప్పగిస్తూ నిర్ణయం తీసుకోవడం రాజకీయంగా పెను దుమారం రేపింది. మరో వైపు రాష్ట్ర అప్పుల భారంపై రెండు పార్టీల మధ్య అంకెల యుద్ధం ముదిరి పాకాన పడింది. బీఆర్ఎస్ వర్షన్ ఇలా వుంది , రాష్ట్ర అప్పులు కేవలం రూ.2.8 లక్షల కోట్లు మాత్రమేనని కేటీఆర్ బల్లగుద్ది చెప్తున్నారు. కాంగ్రెస్ వర్షన్ వింటే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీ సాక్షిగా శ్వేతపత్రం విడుదల చేస్తూ... కాళేశ్వరం, భగీరథ కోసం వివిధ కార్పొరేషన్ల ద్వారా ఆఫ్-బడ్జెట్ రుణాలుగా తెచ్చిన అప్పులతో కలిపి మొత్తం అప్పుల భారం రూ.8.21 లక్షల కోట్లకు ముదిరిందని ఆరోపించారు. ప్రభుత్వ పద్దుల్లో చూపకుండా దాచిన ఈ అప్పుల అసలు, వడ్డీల భారం అంతిమంగా ఖజానాపైనే పడుతోందని, దాదాపు 10 నుండి 10.5 శాతం వరకు భారీ వడ్డీలకు వాణిజ్య బ్యాంకుల నుంచి రుణాలు తెచ్చారని దుయ్యబట్టారు. సంక్షేమ పథకాల్లోనూ భారీగా అక్రమాలు



జరిగాయని రేవంత్ రెడ్డి సర్కార్ ఆరోపణల విలు వదిలింది. రూ.72,816 కోట్లు ఖర్చు చేసిన రైతుబంధు పథకంలో సాగుకు ఏమాత్రం పనికిరాని కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, రోడ్లు, మైనింగ్ భూములు, స్టోన్ క్రషర్లకు సైతం లబ్ధి చేకూర్చారని, దాదాపు రూ. 22,600 కోట్లు అనర్హుల పాలయ్యాయని రేవంత్ రెడ్డి శాసనసభలో ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండించింది. తమ హయాంలో వ్యవసాయ సంక్షోభం వల్ల ఒక్క రైతు కూడా ఆత్మహత్య చేసుకోలేదని, చోటుచేసుకున్న మరణాలన్నీ వ్యక్తిగత, కుటుంబ సమస్యల వల్లేనని వాదించింది. కానీ, నిధుల కొరతతో చివరి రోజుల్లో కొన్ని సీజన్లలో లక్షలాది మంది రైతులకు సకాలంలో రైతుబంధు జమ కాలేదన్నది బహిరంగ రహస్యమే!

**రాజకీయ రణరంగం: ఎత్తులు - పైఎత్తులు:**

ప్రస్తుతం తెలంగాణ రాజకీయం కాళేశ్వరం, అప్పుల చుట్టూనే భగ్గుమంటోంది. కేసీఆర్‌కు నేరుగా సవాలు విసిరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అసెంబ్లీ-మండలి ఉమ్మడి సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని, కాళేశ్వరంపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. దానికి బీఆర్ఎస్ నేతలు స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నదంతా కేవలం రాజకీయ కక్షసాధింపు అని, ప్రాజెక్టుకు చిన్నపాటి మరమ్మతులు చేసేందుకు తమకు అవకాశమిస్తే కాళేశ్వరం సత్తా ఏంటో నిరూపిస్తామని ప్రతిసవాల్ విసిరారు. మరోపక్క, ఈ అప్పుల సుడిగుండం నుంచి గట్టెక్కేందుకు తాము రుణ పునర్ వ్యవస్థీకరణ చేపడుతున్నట్లు కాంగ్రెస్ స్పష్టం చేసింది. 2025--26 నుండి 2031--32 మధ్య చెల్లించాల్సిన బాకీలను రూ.34,058 కోట్ల నుంచి రూ 11,915 కోట్లకు తగ్గించి, రూ.22,142 కోట్ల అదనపు భారాన్ని తప్పించామని, గత ప్రభుత్వం చేసిన అప్పులకు గాను ఇప్పటికే రూ.2,08,681 కోట్లు అసలు, వడ్డీల రూపంలో చెల్లించామని ప్రభుత్వం వెల్లడించింది. గత బీఆర్ఎస్ పాలన మరియు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల మధ్య ప్రధాన పథకాలు, ఆర్థిక అంశాలపై తీవ్రస్థాయిలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 18.8 లక్షల ఎకరాలకు సాగునీరందించే చారిత్రక వరమని బీఆర్ఎస్ పేర్కొనగా, రూ.1.2 లక్షల కోట్లకు వ్యయం పెంచి మేడిగడ్డ కుంగుబాటు వంటి నాణ్యతా లోపాలకు కారణమయ్యారని కాంగ్రెస్ సీబీఐ విచారణకు శ్రీకారం చుట్టింది. అలాగే రాష్ట్ర అప్పుల భారం కేవలం రూ. 2.8 లక్షల కోట్లేనని బీఆర్ఎస్ వాదిస్తుంటే, కార్పొరేషన్ రుణాలతో కలిపి దాచిన బాకీలు రూ.8.21 లక్షల కోట్లకు చేరాయని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అటు రైతుబంధు పథకం ద్వారా రూ.72,816 కోట్ల ఆర్థిక సాయంతో వ్యవసాయ విప్లవం తెచ్చామని గత ప్రభుత్వం చెప్పుకొచ్చినా, సాగుకు పనికిరాని గుట్టలు, క్రషర్లకు సైతం రూ.22,600 కోట్లు దుర్వినియోగం చేశారని ప్రస్తుత ప్రభుత్వం విమర్శిస్తోంది. ఇక మిషన్ భగీరథతో ప్రతి ఇంటికీ తాగునీరు అందించి జల్ జీవన్ మిషన్ అవార్డు సాధించామని బీఆర్ఎస్ వర్గాలు స్పష్టం చేస్తుండగా, నిర్వహణ లోపాలు మరియు కార్పొరేషన్ అప్పుల భారాన్ని కాంగ్రెస్ వేలెత్తి చూపుతోంది.

**చరిత్ర తీర్పు ఏమిటి?**

సందేశం స్పష్టం గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చేందుకు భారీ ప్రయోగాలే చేసింది. మిషన్ భగీరథ, రైతుబంధు, మిషన్ కాకతీయ వంటి పథకాలు గడప గడపకూ చేరి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే, అదే సమయంలో అపరిమితమైన ప్రాజెక్టు వ్యయాలు, ఊహించని రీతిలో పెరిగిన అప్పుల భారం, నిర్మాణాల్లో నాణ్యతా రాహిత్యం, లబ్ధిదారుల ఎంపికలో జరిగిన పొరపాట్లు తెలంగాణ ఆర్థిక మూలాలను దెబ్బతీశాయన్న విమర్శలను కొట్టిపారేయలేం. ఏదేమైనా, ఒక పాలనా కాలాన్ని కేవలం ఆకర్షణీయ పథకాలతోనో లేదా కేవలం ఆర్థిక లోటుపాట్లతోనో విశ్లేషించలేం. పథకం లక్ష్యం, దాని అమలు తీరు, ఖజానాపై పడ్డ భారం ఈ మూడింటిని సమన్వయం చేసుకున్నప్పుడే నిజమైన అభివృద్ధి సాకారమవుతుంది. ప్రస్తుతం నడుస్తున్న సీబీఐ దర్యాప్తు, న్యాయ విచారణల నివేదికలు వెలువడితే తప్ప, కేసీఆర్ హయాం ప్రగతి ప్రస్థానమా లేక అప్పుల అగాధమా అనే దానికి కాలమే ఖచ్చితమైన సమాధానం చెప్పాల్సి ఉంది.

---

# చట్టమే 'హైడ్రా'కు మార్గదర్శి



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496

చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూములను కాపాడడం ఏ ప్రభుత్వానికైనా అత్యంత కీలకమైన బాధ్యత. ముఖ్యంగా వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ వంటి మహానగరంలో సహజ జలవనరులు క్షీణించడం, వర్షపు నీటి మార్గాలు ఆక్రమణలకు గురికావడం వల్ల ప్రతి ఏడాది భారీ వర్షాలకు నగరం తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటోంది. గత కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షాల సమయంలో వేలాది కాలనీలు జలమయమవడం, వందల కోట్ల రూపాయల ఆస్తినష్టం జరగడం, రవాణా వ్యవస్థ స్తంభించడం వంటి పరిణామాలు పట్టణాభివృద్ధిలో జరిగిన ప్రణాళికా లోపాలను స్పష్టంగా బయటపెట్టాయి. ఈ నేపథ్యంలో చెరువులను పునరుద్ధరించడం, నాలాలను పరిరక్షించడం, ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి విముక్తి చేయడం కోసం ప్రత్యేక వ్యవస్థ అవసరమనే విషయంలో పెద్దగా భిన్నాభిప్రాయం ఉండదు. అదే అవసరం నుంచి "హైడ్రా" వంటి సంస్థ ఆవిర్భవించింది. ఏ ప్రభుత్వ సంస్థకైనా లక్ష్యం ఎంత గొప్పదైనా, దానిని అమలు చేసే విధానం అంతకంటే గొప్పదిగా ఉండాలి. ప్రజాస్వామ్యంలో చట్టం కంటే గొప్ప అధికారం ఎవరికీ లేదు. ప్రభుత్వం రూపొందించిన విధానాలు కూడా రాజ్యాంగం, న్యాయస్థానాల ఆదేశాలు, సహజ న్యాయ సూత్రాలకు లోబడే అమలవ్వాలి. ఆక్రమణల తొలగింపు అనేది చట్టబద్ధమైన చర్యే అయినప్పటికీ, దానికి ముందు నోటీసులు ఇవ్వడం, సంబంధిత వ్యక్తులకు తమ వాదనలు వినిపించే అవకాశం కల్పించడం, పత్రాలను పరిశీలించడం, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను గౌరవించడం వంటి కనీస న్యాయపరమైన ప్రక్రియలను పాటించడం తప్పనిసరి. ఇవి కేవలం సాంకేతిక నిబంధనలు కాదు; ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కుల రక్షణకు సంబంధించిన ప్రాథమిక సూత్రాలు. ప్రభుత్వ భూములను రక్షించే క్రమంలో వేల కోట్ల రూపాయల విలువైన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడం వంటి విజయాలు సాధించిన అధికారులను అభినందించాల్సిందే. అయితే అదే సమయంలో అమలు ప్రక్రియలో పారదర్శకత, సమానత్వం, మానవత్వం కనిపించకపోతే ప్రజల్లో అనుమానాలు పెరగడం సహజం. ముఖ్యంగా చిన్న స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలు, దిగువ మధ్య తరగతి కుటుంబాలు, జీవితాంతం కూడబెట్టిన పొదుపులతో ఇల్లు కట్టుకున్న సామాన్యులు ఒకేరోజులో నిరాశ్రయులైతే, ప్రభుత్వం లక్ష్యంపై కాకుండా అమలు విధానంపైనే విమర్శలు కేంద్రీకృతమవుతాయి. చట్టం అందరికీ సమానంగా వర్తించాలనే రాజ్యాంగ సూత్రం ప్రజాస్వామ్యానికి పునాది. ఆక్రమణ చేసిన వ్యక్తి పేదవాడైనా, ధనికుడైనా, రాజకీయ నాయకుడైనా, ప్రభావశీల వ్యాపారవేత్తయినా చట్టం ముందు అందరూ సమానులే. కానీ ప్రజల్లో తరచుగా వినిపించే ప్రధాన విమర్శ ఏమిటంటే, చిన్న ఇళ్లపై చర్యలు వేగంగా జరిగితే, పెద్ద రాజకీయ



లేదా ఆర్థిక ప్రయోజనాలున్న నిర్మాణాలపై చర్యలు నెమ్మదిగా సాగుతున్నాయనే భావన. ఈ భావన నిజమా కాదా అన్నది పక్కనపెడితే కూడా, అలాంటి అనుమానం కలగకుండా ప్రభుత్వం వ్యవహరించాల్సిన బాధ్యత ఉంది. చట్టం అమలులో పక్షపాతం కనిపించిన క్షణం నుంచే ప్రజల విశ్వాసం దెబ్బతింటుంది. ఇటీవలి సంవత్సరాల్లో దేశంలోని పలు రాష్ట్రాల్లో జరిగిన కూల్చివేతల విషయంలో న్యాయస్థానాలు ఒకే విషయాన్ని పదేపదే గుర్తు చేస్తున్నాయి. చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించకుండా, ముందస్తు అవకాశాలు ఇవ్వకుండా, విచారణ పూర్తికాక ముందే కూల్చివేతలు చేపట్టడం రాజ్యాంగబద్ధ పాలనకు అనుకూలం కాదని న్యాయస్థానాలు స్పష్టం చేశాయి. అందు వల్ల ఏ సంస్థ అయినా కోర్టు సూచనలు, ఆదేశాలను అత్యంత గౌరవంతో అమలు చేయాల్సిన బాధ్యత కలిగి ఉంటుంది. ప్రజాస్వామ్యంలో కార్యనిర్వాహక వ్యవస్థ, శాసన వ్యవస్థ, న్యాయ వ్యవస్థ ఒకదానికొకటి ప్రత్యర్థులు కాదు; పరస్పరం సమతుల్యతను కాపాడే రాజ్యాంగ వ్యవస్థలో భాగాలు. పట్టణాభివృద్ధి విషయంలో మరో ముఖ్యమైన అంశం ప్రభుత్వాల వైఫల్యం కూడా. అనేక ప్రాంతాల్లో సంవత్సరాల తరబడి అక్రమ లేఅవుట్లు, అనుమతిలేని నిర్మాణాలు, చెరువుల పరిధిలో రిజిస్ట్రేషన్లు, మౌలిక వసతులు కల్పించడం వంటి చర్యలు ప్రభుత్వ యంత్రాంగం కళ్లముందే జరిగాయి. ఒకవైపు పన్నులు వసూలు చేయడం, విద్యుత్, తాగునీటి కనెక్షన్లు ఇవ్వడం, మరోవైపు చివరికి అదే ఇళ్లను అక్రమమని ప్రకటించడం వల్ల సాధారణ ప్రజలు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిలో బాధ్యత కేవలం ఇల్లు కొనుగోలు చేసిన పౌరులపై మాత్రమే మోపడం న్యాయసమ్మతం కాదు. ప్రణాళికా లోపాలు, పర్యవేక్షణలో వైఫల్యం, అనుమతుల జారీ ప్రక్రియలో జరిగిన తప్పిదాలపై కూడా సమానంగా విచారణ జరగాలి. ప్రకృతి వనరుల పరిరక్షణకు ప్రత్యామ్నాయం లేదు. చెరువులు, నాలాలు ఆక్రమితమైతే దాని మూల్యం మొత్తం నగరమే చెల్లించాల్సి వస్తుంది. వాతావరణ మార్పుల ప్రభావంతో స్వల్పకాలంలో అధిక వర్షపాతం నమోదవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సహజ జలమార్గాలను కాపాడటం అత్యవసరం. అయితే పర్యావరణ పరిరక్షణ పేరుతో సామాజిక న్యాయాన్ని విస్మరించడం కూడా సమంజసం కాదు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పౌర హక్కులు-ఈ మూడు ఒకదానికొకటి విరుద్ధమైనవి కావు; సమతుల్యంగా అమలైతేనే ప్రజాస్వామ్య పరిపాలనపై విశ్వాసం బలపడుతుంది. ఇకపై ప్రభుత్వం హైడ్రా వంటి సంస్థలకు స్పష్టమైన చట్టబద్ధమైన అధికార పరిధిని నిర్వచించాలి. ప్రతి కూల్చివేతకు ముందు డిజిటల్ నోటీసులు, బహిరంగ సమాచారం, అభ్యంతరాల స్వీకరణ, స్వతంత్ర అప్పీల్ వ్యవస్థ వంటి పారదర్శక విధానాలను తప్పనిసరి చేయాలి. చెరువుల పరిరక్షణతోపాటు నిరుపేద కుటుంబాల పునరావాసానికి ప్రత్యేక విధానాన్ని రూపొందించాలి. ప్రత్యామ్నాయ నివాసం లేదా తగిన పునరావాస ప్యాకేజీ లేకుండా పేదలను నిరాశ్రయులను చేయకూడదు. రియల్ ఎస్టేట్ సంస్థలు ప్రభుత్వ అనుమతులు, భూ రికార్డులు, జలవనరుల పరిమితులను పూర్తిగా వెల్లడించే బాధ్యతను చట్టబద్ధంగా నిర్వర్తించాలి. ప్రజలు కూడా భూమి లేదా ఇల్లు కొనుగోలు చేసే ముందు సంబంధిత ప్రభుత్వ రికార్డులు, అనుమతులు, భూ స్వరూపాన్ని తప్పనిసరిగా ధృవీకరించుకోవాలి. రాజకీయ నాయకులు, ప్రభావశీలులు, సామాన్యులు అనే తేడా లేకుండా అందరికీ ఒకే చట్టం అమలైతేనే హైడ్రా లక్ష్యాలకు ప్రజల మద్దతు లభిస్తుంది. చివరికి గుర్తుంచుకోవాల్సిన సత్యం ఒక్కటే-ప్రకృతి పరిరక్షణకు చట్టం అవసరం, కానీ చట్టానికి మానవత్వం తోడైతేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది.






# క్షమాపణల సంగతి సరే.. అక్రమాల సంగతేంది?

- కేసీఆర్ పాలనాకాలంలో అభివృద్ధి..అరాచకాలు
- నేరేళ్ల దాష్టికంపై సిగ్గుతో తలదించుకుంటే సరిపోతుందా?
- మిగతా నియోజకవర్గాల్లో అక్రమాల మాటేంటి?
- కొలువుల దందాల బలవన్మరణాలు
- కాళేశ్వరం అవినీతి హత్యలు
- అదుపులేని అవినీతి.. అడ్డగోలు అక్రమార్జనలు



## కవిత 9 ఏళ్ల జ్ఞానోదయంలో నిజమెంత?

**మాజీ** సీఎం కేసీఆర్ కుమార్తె కవిత తన కుటుంబంతో విభేదించి స్వంత పార్టీని ఏర్పాటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కవిత రాజకీయ పార్టీ ఏర్పాటుపై అనేక విమర్శలు.. సందేహాలు మొదటి నుంచి జనంలో ఉన్నాయి. కేవలం తన సోదరుడు కేటీఆర్‌తో పడకనే ఆమె స్వంత పార్టీ ఏర్పాటు చేసుకుందని అంటున్నారు. కేటీఆర్‌ని సీఎం కాకుండా అడ్డుకోవడమే కవిత లక్ష్యమని అందుకోసమే అవకాశం చిక్కితే కేటీఆర్‌పై దుమ్మెత్తిపోయడానికే ఆమె ప్రయత్నిస్తున్నారనే విమర్శలు బీఆర్ఎస్ నుంచే కాదు మిగతా వర్గాల నుంచి ఉన్నాయి. అయితే కవిత రాజకీయం చేసుకుంటే చేసుకోనియండి. అందులో ఎలాంటి తప్పులేదు. రాజకీయ నేతగా ఎవరిపైన అయినా విమర్శలు చేయవచ్చు..ఆ స్వేచ్ఛ వారికుంటుంది. సిరిసిల్ల జిల్లా నేరెళ్లలో పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడంతో అనారోగ్యం పాలై ఇటీవల చనిపోయిన గంధం గోపాల్ కుటుంబాన్ని మంగళవారం కవిత పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనేక సంచలన వ్యాఖ్యలు చేశారు.' ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సిరిసిల్ల జిల్లా నేరెళ్లలో జరిగిన దాష్టీకం మొత్తం తెలంగాణ సమాజం తలదించుకునే సంఘటన అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. సంఘటన జరిగి దాదాపు 9 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ కూడా ఈ దాష్టీకానికి పాల్పడిన ఒక్క పోలీసుకు గానీ ధన దాహంతో పేదల ప్రాణాలు తీసిన పెద్దలకు గానీ ఎందుకు శిక్ష పడలేదని కవిత ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఈ సంఘటన జరిగినప్పుడు తాను కూడా భాగస్వామిగా ఉన్నందుకు సిగ్గుతో తలదించుకోని క్షమాపణ అడుగుతున్నానని అన్నారు. బాధితులను ఏదో టూరిస్టులు వచ్చి పరామర్శించినట్లు కాకుండా వారికి న్యాయం జరిగే వరకు పోరాడుతానని కవిత చెప్పారు. కొంత మంది ధన దాహం కారణంగా నెరేళ్ల నేల నెత్తురుతో తడిచిందని, ఇసుక కోసం ఎంతో మంది ప్రాణాలను బలి తీసుకున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక కన్నా ప్రాణాలు పలుచన అయ్యాయా అంటూ ప్రశ్నించారు. ఈ సంఘటనను వాడుకొని ఓట్లు వేయించుకున్న రేవంత్ రెడ్డి, బండి సంజయ్‌లను నేను ప్రశ్నిస్తున్నా. దాష్టికానికి పాల్పడిన ఒక్క పోలీసుకైనా శిక్ష పడిందా? జాతీయ ఎస్సీ కమిషన్‌ను తీసుకొచ్చిన బండి సంజయ్ ఆ రిపోర్ట్ ఏమైందో చెప్పాలి". అని కవిత డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ బాధితులకు ఎందుకు న్యాయం చేయటం లేదని కవిత ప్రశ్నించారు.' ఇలా కవిత ప్రశ్నించడం సంచలనంగా మారింది. ఒక రకంగా తన తండ్రి కేసీఆర్ పాలనలో, తన సోదరుడు కేటీఆర్ నియోజకవర్గంలో దారుణమైన దాష్టికం జరిగిందని బహిరంగంగా అంగీకరించడం విశేషం. గత ప్రభుత్వంలో ఈ సంఘటన జరిగినప్పుడు తాను కూడా భాగస్వామిగా ఉన్నందుకు సిగ్గుతో తలదించుకుని క్షమాపణ అడుగుతున్నా అని కవిత చెప్పడం ధైర్యవంతమైన ఒప్పుకోలే.. కవిత అడిగినట్లు నేరేళ్ల బాధితులకు ముమ్మాటికి న్యాయం జరగాల్సిందే. బాధ్యులకు కఠిన శిక్షపడాల్సిందే. ఒకరంగా చెప్పాలంటే నాటి పాలకులుగా ఉన్న కేసీఆర్, కేటీఆర్‌లతోపాటు కేసీఆర్ బంధువుల మీదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు వారంతా జైలుకు వెళ్లాలని కవిత పరోక్షంగా డిమాండ్ చేస్తోంది. ఒకరకంగా కేసీఆర్, కేటీఆర్‌తోపాటు తన బంధువులకు శిక్షలు పడాలని కవిత కోరుకుంటోంది. నిజమే కవిత కోరుకుంటున్నట్లు నేరెళ్ల బాధ్యులకు శిక్షపడాల్సిందే. మరి గత బీఆర్ఎస్ పాలనలో మిగతా దాష్టికాల సంగతేందనేది కవిత సమాధానం చెప్పాలి. ఒక్క సిరిసిల్ల నియోజక వర్గంలో జరిగిన దాష్టికం సంగతే కాదు.. తెలంగాణ వ్యాప్తంగా అనేక నియోజకవర్గాల్లో అనేక అరాచకాలు చోటుచేసుకున్న విషయం కవిత మరువరాదు. వాస్తవానికి గత పదేండ్ల కేసీఆర్ పాలనలో అభివృద్ధి ఎంత జరిగిందో అరాచకం కూడా అంత కన్నా ఎక్కువే జరిగింది. కేసీఆర్ పాలనా కాలంలో అనేక అద్భుత కట్టడాలు, అనేక సంక్షేమ పథకాలను అమలు చేసింది వాస్తవమే. అభివృద్ధి, సంక్షేమం గత బీఆర్ఎస్ పాలనలో నాణానికి ఒక వైపు మాత్రమే. మరోవైపు అరాచకం, నియంతృత్వం, అదుపులేని అవినీతి, వందల కోట్ల రూపాయల దోపిడీ ఉంది. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ తన స్వంత ఆస్తులను అమ్ముకున్నట్లుగా ఆయనకు దగ్గరగా ఉన్నవారు చెబుతుంటారు. తెలంగాణోద్యమ సమయంలో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న కేసీఆర్ తర్వాత కాలంలో ఇంత సంపన్నుడు ఎలా అయ్యారనే ప్రశ్న ఇంకా ప్రశ్నగానే ఉంది. అదేవిధంగా ఏం వ్యాపారాలు చేశారని కేటీఆర్ వద్ద అపార సంపద ఉందనే ప్రశ్న కూడా ఉంది. అదేవిధంగా ఏం వ్యాపారాలు చేసిందని కవిత వద్ద వందల కోట్ల సంపాదన చేరిందనే ప్రశ్న ఉండనే ఉంది. వీటన్నింటికి కారణం అక్రమ సంపాదనే అనే విమర్శలకు జవాబే లేదు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన దాష్టికాల సంగతి కవిత చెప్పి తన తప్పులను అంగీకరిస్తూ క్షమాపణ కోరుకోవడమే కాదు..అధికారం అడ్డం పెట్టుకుని కొల్లగొట్టిన సంపద వివరాలను కూడా కవిత అంగీకరించాలి. వాస్తవ విషయాలను, తెలంగాణ ఏర్పడక ముందు, ఏర్పడిన తర్వాత తన ఆస్తులు,సంపద వివరాలను పూర్తిగా శ్వేత పత్రం రూపంలో విడుదల చేసి తన నిజాయితీని కవిత నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విష యం ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే అసలు దాష్టికాలకు మూలం ధన దాహం కాబట్టి. సిరిసిల్ల నేరెళ్ల ఇసుక దోపిడీ వ్యవహారంలో కూడా ఉన్నది ధన దాహమే కదా? మరి అలాంటప్పుడు ఈ ధన దాహం విషయం, తమ కుటుంబ సంపాదన విషయం కూడా కవిత మాట్లాడాలి. అంతెందుకు తన ఆస్తుల మీద కూడా అనేక ఆరోపణలున్నాయి. కేసీఆర్ పదేండ్ల పాలనా కాలంలో కవిత వందల కోట్ల రూపాయలు వెనకేసుకున్నారనే ఆరోపణలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు స్వంతంగా ఓ రాజకీయ పార్టీనే ఏర్పాటు చేసే స్థాయికి కవిత ఎదగడం ఉదాహరణగా చూపెట్టేవారు అనేక మంది ఉన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో కవిత ప్రమేయం పైన కూడా ఆరోపణలు ఉన్నాయి. వీటన్నింటికి కవిత శ్వేత పత్రం రూపంలో సమాధానం ఇవ్వాలి. కేసీఆర్ పాలనా కాలంలో జరిగిన దాష్టికాలే కాదు..తన కుటుంబం మీద వచ్చిన లక్షల కోట్ల రూపాయల అవినీతి ఆరోపణలకు కూడా కవిత సమాధానం చెప్పాలి. క్షమాపణ చెప్పాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అప్పుడే కవిత మాటలను జనాలు విశ్వసిస్తారని అంటున్నారు. ప్రతీ దాష్టికం వెనక ఉన్నది కేవలం ధన దాహమే .మరి ఇలాంటి ధనార్జన, అంతులేని అవినీతిని వదిలేసి కేవలం నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలని చెప్పడం చేతులు దులుపుకోవడం వంటి చర్యనే అవుతుంది. ఈ విషయం కవిత గమనించాలని కొందరు అంటున్నారు. నాటి దాష్టికాల సమయంలో ప్రభుత్వంలో భాగస్వామి అయినందుకు సిగ్గుపడుతున్నా అని చెప్పడమే కాదు.. గత ప్రభుత్వ హయాంలో నేను అనుభవించిన పదవులు,తీసుకున్న వేతనాలు, సంపాదించిన సంపద అంతా పాప ఫలితమే అని అంగీకరించి కవిత క్షమాపణ కోరాల్సిన అవసరం ఉందనే వాదం విన్పిస్తోంది. వాస్తవానికి తెలంగాణ ఉద్యమం కేసీఆర్ ఫ్యామిలీకి అంతులేని సంపదను తెచ్చిపెట్టిందనే విమర్శలకు కవిత సమాధానం చెప్పాల్సిన తరుణం ఇదే. తను విభేదించిన కేటీఆర్‌ని ఇరుకున పెట్టడానికే కవిత బీఆర్ఎస్ పాలనా కాలపు దాష్టికాలను మాత్రమే ఎండగడుతూ సంపద విషయం మాట్లాడకపోవడం ఏంటనే ప్రశ్న వస్తోంది. ఒకవేళ సంపద గురించి మాట్లాడాల్సి వస్తే తన సం పద గురించి కూడా చెప్పాల్సి వస్తుం దని కవిత వ్యూహాత్మకంగా గత పాలనా వైఫల్యాలను పైపైన ప్రశ్నిస్తూ అన్ని దాష్టికాలకు మూలకారణమైన ధన దాహం గురించి మాట్లాడకపో వడం విచిత్రంగా ఉంది. వాస్తవానికి గత బీఆర్ఎస్ పాలనాకాలంలో చాలా నియోజకవర్గాల్లో ధనార్జనే ధ్యేయంగా కోట్లాది రూపాయల లూటీ చేసిన పాలకులున్నారనే ఆరోపణలున్నాయి. ఉత్తర తెలంగాణలో ఓ నియోజక వర్గంలో ఓ ఫ్యాక్టరీలో కొలువుల దందాలో కోట్లాది రూపాయలు కొల్లగొట్టిన నాటి బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధుల మూలంగా ఎందరో బలవన్మరణాలకు పాల్పడ్డారు. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టులో కోట్లాది రూపాయల అవినీతి జరిగి వందల




కోట్ల రూపాయలను కొల్లగొట్టిన నాటి ప్రజాప్రతినిధులు ఉన్నారు. ఈ విషయాన్ని ప్రశ్నించి ఇరుకున పెడుతున్నారనే కారణంగా న్యాయవాద దంపతులను కిరాతకంగా అంతమొందించిన రక్తపు చరిత్ర కవితకు తెలుసో తెలియదో? విద్య,వైద్య రంగాల్లో మాఫియాలకు పార్టీ టికెట్లు ఇచ్చి వారిని ప్రజాప్రతినిధులుగా చేయాలని చూసిన చరిత్ర కూడా కవిత గుర్తెరగాలి. ప్రజలకు జవాబుదారీగా ఉండా ల్సిన ప్రజాప్రతినిధులు అనేక మంది అనైతిక కార్యకలాపాలకు పాల్పడిన చరిత్రలు వివిధ నియోజకవర్గాల్లో చోటుచేసుకున్న ఘటనలు కవిత గుర్తెరగాలి. అలాగే ప్రభుత్వ లోపాలపై ప్రశ్నించిన గొంతులను అనేక అక్రమ కేసులతో ఇరుకున పెట్టి పోలీస్ కమిషనరేట్‌లనే పార్టీ కార్యాలయాలుగా మార్చిన గత పాలకుల చరిత్రను ఒక్కసారి గత పాలనలో భాగస్వామిగా ఉన్న కవిత చదవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. న్యాయవాద దంపతులను అతి కిరాతకంగా అంతమొందించిన రక్త చరిత్రలో స్వయంగా ఓ కమిషనేరేట్ ఉన్నతాధికారి పాత్ర ఉందనే ఆరోపణలు వచ్చినా పట్టింపు లేని నాటి పాలకుల దాష్టికం మీద కవిత నోరు విప్పాలి. ఇసుక లూటీ నుంచి ఇనుము దోపిడీ వరకు అనేక అక్రమాలు,చేయగూడని అనైతిక కార్యక్రమకాలకు పాల్పడిన అనేక మంది నాటి పాలకులు చెలరేగిపోవడానికి ఎవరు కారకులు? ఎవరి మద్దతుతో వారు అంతలా పేట్రేగిపోయారు? ప్రతీ పది ఇండ్లకో బెల్టు షాపు..కోడి కూయక ముందే బార్లా తెరిచే బార్లు..ఎక్కడ పడితే అక్కడ దోపిడీ..అదుపులేని అహంకారంతో రెచ్చిపోయిన పాలకులను వెనకేసుకొచ్చింది కవిత,కేటీఆర్ కాదా?. నాటి కేసీఆర్ పాలనా కాలంలో జాగృతి పేరిట చేసిన కార్యకలాపాలకు డబ్బులు ఎక్కడివి? అసలు కవిత లేకుండా బతుకమ్మ లేదా? అనే తరహాలో నాటి పాలనా కాలంలో హంగులు, ఆర్భాటాలు చేయడం వెనక ఉన్నది ఎవరు? అనే విషయం మీద కూడా కవిత సమాధానం చెప్పాలి. తప్పులను ఎండగట్టాలి..క్షమాపణలు కోరాలి. అప్పుడే కవిత మాటలను జనం విశ్వసిస్తారు. అవినీతి క్యాన్సర్‌కన్నా ప్రమాదం. అలాంటి అవినీతి చీడ నాటి బీఆర్ఎస్ పాలనా కాలంలో ఎలా హద్దులు దాటిందో దానికి కారకులు ఎవరో? నాటి కేసీఆర్ పాలనా కాలంలో ఎవరు చక్రం తిప్పారో అన్నీ సమాజానికి తెలియాలి. చెప్పులు సక్రంగా లేని వారు కూడా నాటి బీఆర్ఎస్ పాలనా కాలంలో బెంజి కార్లలో తిరిగే స్థాయికి ఎదిగారనే ఆరోపణలు అనేకం ఉన్నాయి. మితిమీరిన అవినీతే ధ్యేయంగా నాటి బీఆర్ఎస్ పాలనాకాలంలో కొందరు ప్రజాప్రతినిధులు అదుపులేకుండా వ్యవహరించారని అంటారు. అందుకే గడిచిన ఎన్నికల్లో సిట్టింగుల్లో మూడొంతుల మంది ఇంటి దారి పట్టిన విషయం గమనించాలి. కేసీఆర్ పాలనా కాలంలో చేసిన అభివృద్ధి పక్కదారి పట్టి జనం నాటి పాలకులను చీదరించడానికి కేవలం అవినీతే కారణం అంటారు. అలాంటి అవినీతి పైన కల్వకుంట్ల కవిత తప్పక ప్రశ్నించాలి. తను ఇతరులను ప్రశ్నించడమే కాదు..తనని తాను తన మీద వచ్చిన, వస్తున ఆరోపణలకు ఖచ్చితంగా సమాధానం చెప్పాలి. అప్పుడే ఆమె చేస్తున్న విమర్శలకు విశ్వసనీయత ఉంటుంది. అంతే తప్ప కేసీఆర్ మంచోడే కానీ కొన్ని గుంట నక్కలు ఆయనని మోసం చేశారని చెప్పడంలో నిజం లేదు. అసలు కేసీఆర్ పాలనా కాలంలో అభివృద్ధి ఎంతలా జరిగిందో అరాచకాలు,అవినీతి అంతే జరిగాయన్న దాంట్లో నిజానిజాలపై కవిత సూటీగా సమాధానం చెప్పాలి. అలాంటి అవినీతి మూలంగానే నేరెళ్ల దాష్టికాలు వంటి అనేక ఘోరాలు,దారుణాలు రాష్ట్రంలో అనేక నియోజకవర్గాల్లో చోటుచేసుకున్నాయి. వీటన్నింటికి కారణం ధనార్జనే ధ్యేయంగా ఉండటం. మరి ఈ మూలం పైన మాట్లాడకుండా ఏదో బాధితులకు నష్టపరిహారం మీద మాట్లాడితే లాభం లేదు. అలా మాట్లాడాల్సిన సందర్భం వచ్చినప్పుడు కవిత మీద కూడా అనేక విమర్శలు వస్తాయి. తనకి ఇంత సంపాదన ఎక్కడిదని? ఒక రాజకీయ పార్టీ ఏర్పాటు చేసేంత స్థాయికి ఎదగడం వెనక ఎవరు ఉన్నా రని? ఇలా అనేక ప్రశ్నలు ఎదురవు తాయి. వీటన్నంటికి కవిత సమాధానం చెప్పాల్సిందే. ఎందుకంటే కేసీఆర్ పదేండ్ల పాలనా కాలంలో దాష్టికాలు జరిగాయని,నాటి పాలనలో భాగస్వా మ్యం అయినందుకు సిగ్గుతో తల దించుకుంటున్నానని,క్షమాపణ కోరు తున్నానని కవితే స్వయంగా ప్రకటించి నప్పుడు నాటి పాలనకాలలో ఒక్క నేరెళ్ల ఘటనే కాదు..అనేక అవినీతి అక్రమాలు జరిగాయనే బలమైన ఆరోపణలకు కవిత సాక్ష్యంగా ఉన్నట్లయింది. ఈ ఆరోపణల్లో కొన్ని తమ కుటుంబం మీదనే కాదు..తన మీద కూడా ఉన్నాయి. అలాంటి వాటన్నింటికి కవిత సమాధానం చెప్పాల్సిన తరుణమిదే. ఎందుకంటే కేసీఆర్ పాలనాకాలంలో చేసిన అభివృద్ధికి మరకలు అంటడంలో కేసీఆర్ కుటుంబం పాత్ర ఉందని ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణలపై ఇప్పుడు కేసులు నమోదయి విచారణలు కూడా జరుగుతున్న విషయం తెల్సిందే. ఈ కుటుంబ సభ్యుల్లో కవిత కూడా ఒకరుగా ఉన్న విషయం మరువరాదు. ఇప్పుడు కుటుంబ సభ్యులతో విభేదించి కొత్త పార్టీ ఏర్పాటు చేసినంత మాత్రాన గత తొమ్మిదేండ్ల అనుభవించిన అధికారం,హోదా గుర్తుకు రాకుండా పోదుకదా?. అధికారం,హోదాలు అనుభవించినప్పుడు దాష్టికాలు,అవినీతి మరకలకు కూడా సమాధానం చెప్పాలి. క్షమాపణలు చెప్పాలి. సిగ్గుతో తల దించుకోవాల్సిందే. అప్పుడే కవిత నిజమైన రాజకీయ నాయకురాలిగా జనం మన్ననలు అందుకోగలుగుతుంది. లేదంటే కేటీఆరే కవిత టార్గెట్ అనే ఆరోపణలే మిగులుతాయి.

ఒక్క సిరిసిల్ల నియోజక వర్గంలో జరిగిన దాష్టికం సంగతే కాదు.. తెలంగాణ వ్యాప్తంగా అనేక నియోజకవర్గాల్లో అనేక అరాచకాలు చోటుచేసుకున్న విషయం కవిత మరువరాదు. వాస్తవానికి గత పదేండ్ల కేసీఆర్ పాలనలో అభివృద్ధి ఎంత జరిగిందో అరాచకం కూడా అంత కన్నా ఎక్కువే జరిగింది. కేసీఆర్ పాలనా కాలంలో అనేక అద్భుత కట్టడాలు, అనేక సంక్షేమ పథకాలను అమలు చేసింది వాస్తవమే. అభివృద్ధి, సంక్షేమం గత బీఆర్ఎస్ పాలనలో నాణానికి ఒక వైపు మాత్రమే. మరోవైపు అరాచకం, నియంతృత్వం, అదుపులేని అవినీతి, వందల కోట్ల రూపాయల దోపిడీ ఉంది.

................
**మానసాని కృష్ణా రెడ్డి**
**9618616110**
**8074124190**
................